

E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 17-05-2026 (వారం) ఆదివారం సంపుటి: 02 || సంచిక:134|| పేజీలు–6
www.ekaburu.com

మోదీ అనాలోచిత విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలు

పెట్రో ధరల పెంపు ఏ మాత్రం సమర్థనీయం కాదు
యుద్ధాన్ని సాకుగా చూపి సామాన్యుల నడ్డి విరచడమే
ఎన్నికలకు ముందు ధరలు పెంచం అని పదే పదే ప్రకటించారు
ఫలితాలు వచ్చాక లీటరుకు రూ.3 పెంచడం ప్రజల్ని వంచించడమే
సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం

ఈకబురు, హైదరాబాద్: నరేంద్ర మోదీ సారథ్యం లోని కేంద్ర ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కేంద్రం తాజాగా తీసుకున్న పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయం ఏ మాత్రం సమర్థనీయం కాదని ఆయన శనివారం ఎక్స్‌లో తెలిపారు. ధరల పెంపు నిర్ణయం అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపుతుందని, నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుందని సీఎం స్పష్టం చేశారు. ఆత్మనిర్భర్ కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప ఫలితాలు తెచ్చిన పాలసీ కాదని తేలిపోయిందని ఆయన పేర్కొన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయని, యువత ఉపాధికి గ్యారంటీ లేని పరిస్థితి దాపురించిందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీ ఒట్టి మాటగా మిగిలిందని విమర్శించారు.

మిగతా 2లో

జైలుకు బండి భగీరథ్

4 రోజుల రిమాండు..
చర్లపల్లికి తరలింపు
అంతకుముందు హైడ్రామా
అదుపులోకి తీసుకున్నట్లు
పోలీసుల వెల్లడి
తానే అప్పగించానంటూ
కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటన

ఈ-కబురు, హైదరాబాద్ -

పేట్‌బషీరాబాద్, జీడిమెట్ల, న్యూస్‌టుడే: పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్‌ను శనివారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. న్యాయమూర్తి అతనికి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం నుంచే నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ముందస్తు బెయిలుకు, అరెస్టు నుంచి రక్షణకు హైకోర్టులో భగీరథ్‌కు ఉపశమనం లభించని నేపథ్యంలో పరిణామాలు వేగంగా మారిపోయాయి. శనివారం ఉదయం పోలీసులు భగీరథ్‌పై లుకౌట్ సర్క్యులర్ జారీ చేశారు. అతణ్ని పట్టుకోవడానికి ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నివాసానికి సైతం వెళ్లారు. ఈ నేపథ్యంలో తన కుమారుడిని తానే పోలీసులకు అప్పగించినట్లు రాత్రి 8 గంటల సమయంలో బండి సంజయ్ ప్రకటన విడుదల చేశారు.

మిగతా 2లో

పట్టణాల్లో నివాస ప్రాంతాలకు సమీపంలోనే ఇందిరమ్మ ఇళ్లు

రెండో విడత పథకంలో అనేక వెసులుబాట్లు
ఈ నెలాఖరులోపు భూముల విలువ సవరణ
మీడియాతో ఇష్టాగోష్ఠిలో మంత్రి పొంగులేటి

ఈకబురు, హైదరాబాద్: పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లను పేదలు నివాసం ఉంటున్న ప్రాంతాలకు సమీపంలోనే నిర్మించి ఇవ్వనున్నట్లు రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం సచివాలయంలో మంత్రి విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. గత 25 రోజులుగా అన్ని జిల్లాల ప్రజాప్రతినిధులతో సమీక్షలు నిర్వహించి పథకాలపై విస్తృతంగా చర్చించామని... ప్రజాప్రతినిధులు తెలిపిన సమస్యలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ''గత ప్రభుత్వం శాసనసభ ఎన్నికలకు ముందు 38 వేల ఇళ్లను లబ్ధిదారులకు ఖరారు చేసింది. దానిపై మేం శాస్త్రీయ సర్వే నిర్వహించాం. 16 వేల మంది ఈ ఇళ్లలో చేరనట్లుగా గుర్తించాం. హైదరాబాద్‌లో పనిచేసుకుని జీవించే వారికి ఎక్కడో 25 కి.మీ.దూరంలో ఇళ్లు ఇవ్వడంతో వారిలో కొందరు కిరాయికి ఇచ్చారని తెలుసుకున్నాం. అందుకే పేదలకు అనువైన ప్రాంతాల్లోనే ఇళ్లు కేటాయించాలని నిర్ణయించాం.

02

తయారీ దగ్గరే లీక్

నీట్ ప్రశ్న పత్రం లీక్ కేసులో బయాలజీ లెక్చరర్ అరెస్టు
కులకర్ణితో కలిసి కుట్ర
పుణెలోని ఇంట్లోనే తరగతులు
రూ.లక్షల్లో వసూలు
ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని కాంగ్రెస్ డిమాండ్



ఈకబురు,దిల్లీ: నీట్‌యూజీ ప్రశ్న పత్రం లీక్‌లో దానిని తయారు చేసిన నిపుణులే 'నైపుణ్యం' చూపినట్లు వెల్లడవుతోంది. ప్రశ్న పత్రాలను రూపొందించిన వారిలో ఒక్కొక్కరుగా నిందితులుగా తేలుతున్నారు. శుక్రవారం కెమిస్ట్రీ పేపరును తయారు చేసిన పి.వి.కులకర్ణి అరెస్టుకాగా శనివారం బయాలజీ నిపుణురాలు మనీషా గురునాథ్ మంథారేను సీబీఐ అదుపులోకి తీసుకుంది. ఆమె జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) పేపర్ సెట్టింగ్ కమిటీలో సభ్యురాలు. ప్రశ్న పత్రం తయారీలో కీలక నిందితుడిగా భావిస్తున్న కులకర్ణిని ప్రశ్నించగా మంథారే పేరు బయటకు వచ్చింది

మిగతా 2లో

పెట్టుబడులతో ఉత్తరాంధ్రకే వలసలు

ఈ-కబురు నరసన్నపేట, మే 16:

గొడ్డలి పార్టీతో ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వేటు పడిందని, ప్రజా ప్రభుత్వంలో ఉత్తరాంధ్ర నుంచి వలసలు వెళ్లకుండా ఉత్తరాంధ్రకే వలసలు వచ్చేలా సంకల్పం తీసుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర తో పాటు రాయల సీమ కోస్తా జిల్లాల అభ్యర్థులు అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రోజుకు ఓ డ్రామాతో వచ్చే వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మళ్లీ రాష్ట్రంలో వైకుంఠపాళి వద్దని హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలోని తామ్రపల్లిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ప్రజా వేదిక సభలో పాల్గొని ముఖ్యమంత్రి ప్రసంగించారు. "రాష్ట్రం పరిశుభ్రంగా ఉండాలనే సంకల్పంతోనే స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టాం. స్వచ్ఛపథం కార్యక్రమంలో భాగంగా గ్రామీణ అర్బన్ ప్రాంతాల్లోని రహదారులను శుభ్రపరిచేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ప్రతినెలా ఒకటో తేదీన పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొని అర్హులకు స్వయంగా పింఛన్లు అందించడం ద్వారా ఎంతో ఆనందం కలుగుతోంది. పేదరికం లేని సమాజం , ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం

మిగతా 3లో

బండి సంజయ్ ను మంత్రివర్గం నుండి తొలగించాలి

ఆయన కుమారుడి మీద నమోదైన పోక్సో కేసులో విచారణ పారదర్శకంగా జరగాలంటే ఆయన పదవిలో ఉండొద్దు
ప్రధాని మోడీ కి తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత లేఖ

02

న్యాయవ్యవస్థ 24x7 పనిచేయాలి: సీజేఐ

03

కోల్‌కథ.. ఇంకా ఉంది

ఐపీఎల్-19లో వరుసగా మూడో రోజు అదే కథ! పాయింట్ల పట్టికలో పైనున్న జట్టుకు కిందున్న జట్టు షాకిచ్చింది. పంజాబ్ కింగ్స్‌కు ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్‌కింగ్స్‌కు లఖ్‌నవూ సూపర్‌జెయింట్స్ చెక్ పెట్టగా..

06



03

వ్యాసాశ్రమంలో
వివాదాల ముసురు

ఆరోపణలు
ప్రత్యారోపణలతో భక్తుల్లో గందరగోళం
ఆశ్రమ ఆస్తులు, ఆర్థిక వ్యవహారాలు, పరిపాలనపై పారదర్శక విచారణకు డిమాండ్

CBSE 03

త్రిభాషా విధానంపై సీబీఎస్ఈ కీలక నిర్ణయం

ఈ-కబురు , హైదరాబాద్: సీబీఎస్ఈ కీలక నిర్ణయం తీసుకుంది. తొమ్మిది, పది తరగతి విద్యార్థులకు త్రిభాషా విధానాన్ని తప్పనిసరి చేసింది. జులై ఒకటి నుంచి ఇది అమల్లోకి వస్తుందని వెల్లడించింది.

జైలుకు బండి భగీరథ్

ఆ తర్వాత కొద్దిసేపటికే భగీరథ్‌ను అరెస్టు చేశామంటూ సైబరాబాద్ పోలీసులు ప్రకటించారు. పోలీస్ అకాడమీ (అప్పా జంక్షన్) సమీపంలో అదుపులోకి తీసుకున్నామని, నేరుగా పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు. భగీరథ్‌ను స్టేషన్ తీసుకెళ్లగానే కేసు పర్యవేక్షణాధికారిణి, డీసీపీ రితిరాజ్ అక్కడికి చేరుకున్నారు. ఏసీపీ శంకర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ విజయ్‌వర్ధన్ నిందితుడిని కోర్టుకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. అరెస్టును ప్రకటించాక భగీరథ్‌కు తొలుత స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం మేడ్చల్‌లోని న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారు. భగీరథ్‌ను పోలీసులు రాత్రి 12 గంటల సమయంలో చర్లపల్లి జైలుకు తరలించారు.

రోజంతా ఉత్కంఠ..

పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 8న పోక్సో కేసు నమోదైనప్పటి నుంచి భగీరథ్ పరారీలోనే ఉన్నాడు. శనివారం ఉదయం అతను లొంగిపోతాడని ఒకవైపు ప్రచారం జరుగుతుండగానే... పోలీసులు హైదరాబాద్, కరీంనగర్‌లలోని వివిధ ప్రాంతాల్లో ఐదు బృందాలతో గాలించారు. బంజారాహిల్స్ సాగర్ సొసైటీలోని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇంట్లోనూ తనిఖీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. నిందితుడు లేకపోవడంతో గంట తర్వాత పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. విదేశాలకు పారిపోయే అవకాశముందనే అనుమానంతో పోలీసులు లుకౌట్ సర్క్యులర్ జారీ చేయడం ఉత్కంఠకు దారితీసింది. భగీరథ్‌పై కేసు నమోదైన మరుసటి రోజు నుంచే అతని ఫోన్ స్విఛాఫ్ కావడంతో కాల్‌డేటా రికార్డులను పోలీసులు పరిశీలించారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ ప్రాంతాల్లో ఉండే స్నేహితులతో చివరగా మాట్లాడినట్లు గుర్తించి శనివారం ఆయాచోట్ల వెతికారు. మరో ప్రత్యేక బృందం కరీంనగర్‌లోని భగీరథ్ ఇంటితోపాటు అతని మేనమామ వంశీకృష్ణ, స్నేహితులు, భాజపా కార్యకర్తల ఇళ్లలో తనిఖీ చేసినా ఫలితం కనిపించలేదు. మరోవైపు సాయంత్రం సమయంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని అన్ని ఠాణాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో ఎక్కడైనా లొంగిపోవచ్చని భావించారు. ఈ క్రమంలోనే రాత్రి బండి సంజయ్ ప్రకటన వెలువరించడం... లొంగిపోవడం... మరోవైపు పోలీసులు అరెస్టు చేసినట్లు ప్రకటించడం వెన్వెంటనే జరిగిపోయాయి. రాత్రి 9 గంటల సమయంలో నాలుగు కార్లలో ఇద్దరు న్యాయవాదుల్ని వెంటబెట్టుకుని భగీరథ్ నేరుగా పేట్‌బషీరాబాద్ ఠాణాకు వెళ్లినట్లు కొన్ని ఫోటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

ఠాణా ముందు భారీ బందోబస్తు

భగీరథ్ లొంగిపోతాడనే సమాచారంతో... సైబరాబాద్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయం, పేట్‌బషీరాబాద్ ఠాణాల దగ్గర పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భగీరథ్ తరపున న్యాయవాది ఒకరు స్టేషన్‌కు రావడంతో నిందితుడు కచ్చితంగా వస్తాడని అంచనా వేశారు. భగీరథ్‌ను బండి సంజయ్ వెంటబెట్టుకుని స్వయంగా స్టేషన్‌కు వస్తారనీ ప్రచారం జరిగింది. ముందు జాగ్రత్తగా పోలీసులు ఠాణా గేటు ముందు బారికేడ్లు ఏర్పాటు చేశారు. కేసు పంచనామా కోసం తహసీల్దార్ కార్యాలయానికి చెందిన రికార్డు అసిస్టెంట్ బాలప్రసాద్‌ను మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి పిలిపించడంతో.. బండి భగీరథ్ పోలీస్ స్టేషన్‌కు వస్తాడని అంతా అంచనా వేశారు.

మేజిస్ట్రేట్ ఎదుట బాధితురాలి వాంగ్మూలం

ఈ కేసులో పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 183 ప్రకారం... జడ్జి సమక్షంలో

బాధితురాలి వాంగ్మూలం సేకరించారు. శనివారం ఉదయం పోలీసులు ఆమెను మేడ్చల్ కోర్టుకు తీసుకెళ్లి అక్కడే ఈ ప్రక్రియ పూర్తి చేశారు. పోక్సో కేసుల్లో న్యాయమూర్తి ముందు ఇచ్చే వాంగ్మూలం ఎంతో కీలకం. కేసు దర్యాప్తు దీని మీదే ఆధారపడి ఉంటుంది. ఈ వాంగ్మూలాన్ని వీడియో రికార్డింగ్ చేసి భద్రపరుస్తారు. బాధితురాలు కోర్టు విచారణకు వెళ్లాల్సిన అవసరం లేకుండా దీన్నే ఆధారంగా భావిస్తారు. ఫిర్యాదుదారు అయిన బాధితురాలి తల్లి వాంగ్మూలాన్ని కూడా రికార్డు చేశారు.

14 మంది యూట్యూబర్లపై కేసు

ఈ కేసులో మైనర్ అయిన బాధితురాలిపై యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఇతర సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేసిన 14 మంది మీద పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ రాజారెడ్డి ఫిర్యాదుతో ఈ కేసులు నమోదయ్యాయి. మరో 27 మంది యూట్యూబర్ల మీద పోలీసులకు ఫిర్యాదులు అందాయి.

మోదీ అనాలోచిత విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలు

ఆత్మనిర్భర్ కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప ఫలితాలు తెచ్చిన పాలసీ కాదని తేలిపోయిందని ఆయన పేర్కొన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయని, యువత ఉపాధికి గ్యారంటీ లేని పరిస్థితి దాపురించిందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీ ఒట్టి మాటగా మిగిలిందని విమర్శించారు. గత పదేళ్లుగా రూపాయి విలువ పతనమవుతూ వస్తూ ఇప్పుడు పరాకాష్ఠకు చేరిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఇరాన్ ఇజ్రాయెల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమేనని ఆయన వివరించారు. ప్రపంచంలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని ఘనంగా ప్రకటించుకుంటున్న మోదీ ప్రభుత్వం ధరల పెంపు నిర్ణయాన్ని ఎలా సమర్థించుకుంటుందని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత ఎన్నికలకు ముందు మోదీ ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం అని పదే పదే ప్రకటించి ఫలితాలు వచ్చి పది రోజులు కూడా గడవకముందే లీటరుకు రూ.3 చొప్పున పెంచడం ప్రజల్ని వంచించడమేనని విమర్శించారు. కేవలం ఓట్ల కోసం, ఎన్నికల్లో విజయం కోసం మోదీ అబద్ధాలు చెబుతారని ప్రజలు భావిస్తున్నారని.. ఇది విశ్వాస ఘాతుకం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

భానుడి భగభగ

.. ఆదిలాబాద్‌లో 44 డిగ్రీల ఉష్ణోగ్రత

ఈకబురు,, హైదరాబాద్:

ఈ నెల 26న నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవుల మీదుగా కేరళ తీరాన్ని తాకుతాయని, అక్కడి నుంచి నాలుగైదు రోజుల్లో తెలంగాణలో ప్రవేశిస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇవాళ ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ అధికారి ధర్మరాజు తెలిపారు. మహబూబ్‌నగర్, గద్వాల, నారాయణపేట జిల్లాల్లో 4144 డిగ్రీలు, మిగతా జిల్లాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు చెప్పారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది.

స్త్రీనిధి 'అసలు సిసలు' మహిళా బ్యాంక్; మంత్రి సీతక్క



ఈకబురు హైదరాబాద్ :

స్త్రీనిధితో 32 లక్షల మందికి పైగా మహిళలకు రూ.24 వేల కోట్ల రుణాలు అందించడం గొప్ప విజయమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. స్త్రీనిధి అసలు సిసలు మాహిళా బ్యాంక్ అని కొనియాడారు. తెలంగాణ మహిళలకు స్త్రీనిధి ఒక నమ్మకమైన బ్యాంక్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణ స్త్రీనిధి మోడల్‌ను ఇతర రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నాయని చెప్పారు. ప్రజా భవన్‌లో స్త్రీనిధి వార్షిక కార్యాచరణ ప్రణాళిక అమలు కార్యక్రమం నిర్వహించారు.

మంత్రి సీతక్క అభినందనలు

స్త్రీనిధి ఉద్యోగులంతా కలిసి స్త్రీనిధి స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ను ఏర్పాటు చేసుకోగా మంత్రి సీతక్క అభినందించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ సంఘం ఉద్యోగులను ఐక్యం చేయడమే కాకుండా, హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తు చేస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగులు తమ ప్రయోజనాలతోపాటు లక్షలాది మహిళల ఆర్థిక సంక్షేమాన్ని కాపాడాలని కోరారు. రాజ్యాంగం హక్కులతో పాటు బాధ్యతలను కూడా నిర్దేశించిందన్నారు. స్త్రీనిధి సంస్థ మన ఇల్లు లాంటిది.. సంస్థను కాపాడుకుంటేనే ఉద్యోగుల హక్కులు, భవిష్యత్తు సురక్షితంగా ఉంటాయన్నారు.

ముందుకు సాగుతున్న స్త్రీనిధి

2011లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన స్త్రీనిధి, సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మరింత బలోపేతం అవుతోందన్నారు. మైక్రో ఫైనాన్స్ సంస్థలు, అధిక వడ్డీ వ్యాపారుల బారిన పడుతున్న మహిళలను ఆదుకోవడానికే స్త్రీనిధి ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళల అభివృద్ధే తెలంగాణ అభివృద్ధి అనే నమ్మకంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.దేశ జీడీపీలో మహిళల భాగస్వామ్యం ప్రస్తుతం 18 శాతానికే పరిమితమైందని, అభివృద్ధి చెందిన దేశాల్లో అది 40 శాతానికి చేరుకుందని పేర్కొన్నారు.

మహిళలకు అండగా ప్రభుత్వం

తెలంగాణ మహిళలు కూడా ఆ స్థాయికి ఎదగాలని, అందుకోసం ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందన్నారు. మాది ఉద్యోగ అనుకూల ప్రభుత్వం అని, స్త్రీనిధిలో ఒక్కరిని కూడా తొలగించలేదని, ఇప్పటికే పదోన్నతులు, బదిలీలు పూర్తి చేశామని, సెర్ప్‌లో వంద శాతం బదిలీలు నిర్వహించామన్నారు.స్త్రీనిధిని బలోపేతం చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం తప్ప, ఎవరి ఉద్యోగాలను తొలగించడం కాదని పేర్కొన్నారు.స్త్రీనిధి మహిళల కోసం, మహిళల ఆధ్వర్యంలో నడిచే సంస్థ అని, దీనిని కాపాడుకుంటూ మహిళల ఆర్థిక అభివృద్ధికి మరింత బలోపేతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డి, డిప్యూటీ ఎండీ శ్రీనాథ్, స్త్రీనిధి ఉద్యోగులు పాల్గొన్నారు.

పట్టణాల్లో నివాస ప్రాంతాలకు సమీపంలోనే ఇందిరమ్మ ఇళ్లు

ఈకబురు, హైదరాబాద్: పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లను పేదలు నివాసం ఉంటున్న ప్రాంతాలకు సమీపంలోనే నిర్మించి ఇవ్వనున్నట్లు రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం సచివాలయంలో మంత్రి విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. గత 25 రోజులుగా అన్ని జిల్లాల ప్రజాప్రతినిధులతో సమీక్షలు నిర్వహించి పథకాలపై విస్తృతంగా చర్చించామని... ప్రజాప్రతినిధులు తెలిపిన సమస్యలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ''గత ప్రభుత్వం శాసనసభ ఎన్నికలకు ముందు 38 వేల ఇళ్లను లబ్ధిదారులకు ఖరారు చేసింది. దానిపై మేం శాస్త్రీయ సర్వే నిర్వహించాం. 16 వేల మంది ఈ ఇళ్లలో చేరనట్లుగా గుర్తించాం. హైదరాబాద్‌లో పనిచేసుకుని జీవించే వారికి ఎక్కడో 25 కి.మీ.దూరంలో ఇళ్లు ఇవ్వడంతో వారిలో కొందరు కిరాయికి ఇచ్చారని తెలుసుకున్నాం. అందుకే పేదలకు అనువైన ప్రాంతాల్లోనే ఇళ్లు కేటాయించాలని నిర్ణయించాం. గతంలో కేటాయించిన వాటిలో నివాసం ఉండని వారి ఇళ్లు రద్దు చేస్తాం. వారెక్కడైనా కోరుకుంటే అక్కడ ఇస్తాం. శిథిలావస్థకు చేరిన వాంబే, ఎన్ఆర్‌జేఏఎంఎస్ కాలనీల ఇళ్ల స్థానంలో కొత్తవి నిర్మించి ఇస్తాం. మంత్రివర్గంలో ఈ అంశాలన్నీ చర్చిస్తాం'' అని తెలిపారు.

పై అంతస్తు నిర్మించుకునేలా...

ఉమ్మడి కుటుంబాలలో తక్కువ స్థలంలో ఇల్లు కట్టుకుంటే ఉన్న ఇంటిపై పై అంతస్తుగా ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకునే అవకాశాన్ని పరిశీలిస్తున్నామని మంత్రి తెలిపారు. ''తొలి విడతలో 1.32 లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. జూన్ 2న ప్రారంభంకానున్న రెండో విడతలో అనేక వెసులుబాట్లు కల్పించనున్నాం. గోడలు, బేస్‌మెంట్, స్లాబ్ ఇలా ఏదైనా ఒక దశవరకు ఉన్న ఇళ్లను పూర్తి చేసుకునేలా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం. గత ప్రభుత్వం మంజూరు చేసిన రెండు పడక గదుల ఇళ్లను పూర్తి చేసేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు. వాటిని అర్హులైన వారికి కేటాయించి మిగిలిన పనులు పూర్తి చేసుకునేలా ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తాం. బహుళ అంతస్తుల భవనాల్లో ఉన్న వాణిజ్య దుకాణాలను లీజుకు ఇవ్వకుండా విక్రయించి భవనాల సంఘాలకు ఆ డబ్బు డిపాజిట్ చేస్తాం. ఇళ్ల పథకంలో ఒక్కో ఇంటికి కేంద్రం వాటాగా రావాల్సిన రూ.1.13 లక్షల్ని కేంద్రం విడుదల చేయడం లేదు. అందుకే మొదటి విడత ఇళ్లకు చివరి బిల్ విడుదల చేయలేదు. కేంద్రం ఇవ్వకపోతే రాష్ట్ర ప్రభుత్వమే మొత్తం రూ.5 లక్షలు విడుదల చేస్తుంది'' అని మంత్రి పొంగులేటి తెలిపారు.

ఓఆర్ఆర్ లోపల ఎకరా కనిష్ఠంగా రూ.15 లక్షలు చేస్తాం

రాష్ట్రంలో భూముల ప్రభుత్వ విలువ హెచ్చుతగ్గులుగా ఉందని అందుకే సవరణ చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ''ఆర్థికవేత్త అరవింద్ సుబ్రహ్మణ్యం సలహా మేరకు రాష్ట్రంలో ఈ నెలాఖరులోపు భూముల విలువ సవరిస్తాం. బాహ్యవలయ రహదారి పరిధిలో బహిరంగ ధర అధికంగా ఉండగా, ప్రభుత్వ విలువ చాలా తక్కువగా ఉంది. ఓఆర్ఆర్ లోపల ఎకరా కనిష్ఠంగా రూ.15 లక్షలు చేస్తాం'' అని తెలిపారు.

కేరళలో 14 నియోజకవర్గాల్లో ప్రచారం.. 10 చోట్ల విజయం

ఇటీవల కేరళ శాసనసభ ఎన్నికల్లో తాను ప్రచారం చేసిన 14 నియోజకవర్గాల్లో 10 చోట్ల విజయం సాధించినట్లు మంత్రి తెలిపారు. బండి భగీరథ్ కేసు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సినవన్నీ చేస్తోందని అన్నారు. ''ఇందిరమ్మ ఇల్లు వచ్చిన విషయమై ఓ మహిళ చెప్పిన విషయాన్ని సోషల్ మీడియా వక్రీకరించి ప్రచారం చేస్తుండటం బాధాకరం. దీనిపై నేను లోతుగా విచారణ చేయించా. ముమ్మాటికీ ఆ కుటుంబం పేదదే. కుమారుడు విదేశాలకు వెళ్లినంత మాత్రాన ధనిక కుటుంబమైపోతుందా? పేదలు అప్పు చేసి వారి పిల్లలను అమెరికా పంపద్దా? మరొక కుమారుడు భగీరథ పథకంలో రూ.7 వేలకు పనిచేస్తున్నాడు'' అని చెప్పారు. ఆసరా పింఛన్ల విషయంలో ప్రభుత్వం కచ్చితమైన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

బండి సంజయ్ ను మంత్రివర్గం నుండి తొలగించాలి

ఈకబురు,,హైదరాబాద్:

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడి మీద నమోదైన పోక్సో కేసులో విచారణ పారదర్శకంగా జరగాలంటే ఆయనను మంత్రి వర్గం నుంచి తొలగించాలంటూ ప్రధాని మోడీకి తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత లేఖ రాశారు. బండి సంజయ్ కుమారుడి మీద అత్యంత తీవ్రమైన పోక్సో కేసు నమోదైనందున కేసు విచారణ పారదర్శకంగా జరగాలంటే బండి సంజయ్ లో పదవిలో ఉండకూడదని లేఖలో పేర్కొన్నారు. ఈ కేసులో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా స్వతంత్ర విచారణ జరిగేందుకు ప్రధాని మోడీ చొరవ చూపాలన్నారు. దేశంలో మైనర్ల రక్షణ కన్నా రాజకీయ ప్రయోజనాలు ఎక్కువ కాదని ప్రధాని గుర్తించాలన్నారు. బాధితురాలికి పూర్తి న్యాయం జరగాలన్నా, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ప్రజల్లో నమ్మకం కలగాలన్న...విచారణలో ఎలాంటి రాజకీయ జోక్యం ఉండొద్దని సూచించారు. రాజ్యాంగ నిబద్ధతను, నైతిక విలువలను కాపాడటం ప్రధానిగా మీ తక్షణ కర్తవ్యమని గుర్తించాలని కవిత అన్నారు. ఈ కేసు విచారణ పూర్తయ్యే వరకు బండి సంజయ్ ను మంత్రివర్గం నుంచి తప్పించాలని మిమ్మల్ని కోరుతున్నాంటూ ప్రధాని కి రాసిన లేఖలో కవిత తెలిపారు.

లేఖలో కవిత ప్రస్తావించిన అంశాలు

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడిపై పెట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహిత అలాగే అత్యంత తీవ్రమైన బాలల లైంగిక నేరాల నిరోధక చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదైంది. మైనర్ బాలికకు సంబంధించిన కేసు కావడంతో ఈ దర్యాప్తు లోఎటువంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా స్వతంత్రంగా విచారణ జరగాల్సిన అవసరం ఉంది. బండి సంజయ్ ప్రస్తుతం దేశంలోనే అత్యంత కీలకమైన, చట్టాన్ని అమలు చేసే అధికారాలు గల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కొనసాగుతున్నారు. చట్టపరంగా ఆయన కుమారుడి పై నేర నిరూపణ అనేది న్యాయస్థానం తేల్చాల్సిన విషయమే. కానీ ఆయన అదే పదవిలో కొనసాగడం వల్ల దర్యాప్తు ప్రక్రియ, సాక్ష్యాల సేకరణ, సాక్షుల రక్షణపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ కేసులో బాధితురాలికి పూర్తి న్యాయం జరగాలన్నా, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ప్రజల్లో నమ్మకం కలగాలన్న విచారణలో రాజకీయ జోక్యం ఉండకూడదు.

రాజ్యాంగ నిబద్ధతను, నైతిక విలువలను కాపాడటం మీ తక్షణ కర్తవ్యం.దేశంలోని మైనర్ల రక్షణ, న్యాయ వ్యవస్థ సమగ్రత అనేది రాజకీయ ప్రయోజనాల కంటే మిన్న. అందుకే కేసు దర్యాప్తు , న్యాయస్థాన విచారణ పూర్తయ్యే వరకు బండి సంజయ్ కుమార్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుండి తక్షణమే తొలగించాలి.

తయారీ దగ్గరే లీక్

ఈకబురు,దిల్లీ: నీట్‌యూజీ ప్రశ్న పత్రం లీక్‌లో దానిని తయారు చేసిన నిపుణులే 'నైపుణ్యం' చూపినట్లు వెల్లడవుతోంది. ప్రశ్న పత్రాలను రూపొందించిన వారిలో ఒక్కొక్కరుగా నిందితులుగా తేలుతున్నారు. శుక్రవారం కెమిస్ట్రీ పేపరును తయారు చేసిన పి.వి. కులకర్ణి అరెస్టుకాగా శనివారం బయాలజీ నిపుణురాలు మనీషా గురునాథ్ మంథారేను సీబీఐ అదుపులోకి తీసుకుంది. ఆమె జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) పేపర్ సెట్టింగ్ కమిటీలో సభ్యురాలు. ప్రశ్న పత్రం తయారీలో కీలక నిందితుడిగా భావిస్తున్న కులకర్ణిని ప్రశ్నించగా మంథారే పేరు బయటకు వచ్చింది. ఆమెతోపాటు మరి కొందరి పేర్లను అతడు చెప్పినట్లు సమాచారం. మంథారేకు బోటనీ, జువాలజీ ప్రశ్నలన్నీ అందుబాటులో ఉన్నాయి. దీంతో ఆమె వాటిని లీక్ చేసినట్లు తేలింది. పుణెకు చెందిన మనీషా వాగ్మేర్ ద్వారా ఆమె నీట్ విద్యార్థులకు అందుబాటులోకి వచ్చినట్లు తెలుస్తోంది. వాగ్మేర్‌ను ఈ నెల 14వ తేదీనే పోలీసులు అరెస్టు చేశారు. పుణెలోని తన ఇంట్లోనే మంథారే ప్రత్యేకంగా కొంత మంది నీట్ విద్యార్థులకు తరగతులు నిర్వహించినట్లు వెల్లడైంది. వారి వద్ద నుంచి రూ.లక్షలు వసూలు చేసినట్లు తేలింది. అమె అందించిన ప్రశ్నల్లో చాలా వరకూ నీట్ పరీక్షలో వచ్చిన వాటితో సరిపోలాయి. దీంతో ఈ నెల 3వ తేదీన జరిగిన నీట్‌యూజీని ఎన్‌టీఏ రద్దు చేసింది. పుణెలోని మోడరన్ ఆర్ట్స్, సైన్స్ అండ్ కామర్స్ కళాశాలలో మంథారే లెక్చరర్‌గా పని చేస్తున్నారు. ఆమె 11, 12 తరగతులకు 24 ఏళ్లుగా బయాలజీ బోధిస్తున్నారు.

కులకర్ణి కూడా లాతూర్‌లోని తన ఇంట్లో ఏప్రిల్ చివరి వారంలో కొంత మంది విద్యార్థులకు ప్రత్యేకంగా కోచింగ్ క్లాస్‌లు నిర్వహించినట్లు వెల్లడైంది. వారికి అతడు ప్రశ్నలు, సమాధానాలను అందించినట్లు తేలింది. ఇందుకోసం విద్యార్థులు అతడికి లక్షల రూపాయలను చెల్లించినట్లు వెల్లడైంది. అరెస్టు చేసిన కులకర్ణి, వాగ్మేర్‌లను 10 రోజుల సీబీఐ కస్టడీకి అప్పగిస్తూ శనివారం దిల్లీ కోర్టు జడ్జి అజయ్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. కులకర్ణి నుంచి ధనుంజయ్ లోఖండే సమాచారాన్ని సేకరించి వాగ్మేర్ ద్వారా లీక్ చేశారని సీబీఐ కోర్టుకు తెలిపింది.

ఎన్‌టీఏలో నియామకాలు

ఎన్‌టీఏలో ఇద్దరు సంయుక్త కార్యదర్శులు, ఇద్దరు సంయుక్త డైరెక్టర్లను శనివారం కేంద్ర ప్రభుత్వం నియమించింది. నీట్‌యూజీ ప్రశ్న పత్రం లీక్ నేపథ్యంలో తిరిగి పరీక్ష నిర్వహించాలని నిర్ణయించడంతో వారిని నియమించినట్లు తెలుస్తోంది. వారిలో 1998 బ్యాచ్ ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ అధికారి అనూజ బాపట్, 2004 బ్యాచ్ ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ (కస్టమ్స్ అండ్ పరోక్ష పన్నులు) అధికారి రుచితా విజ్‌లు సంయుక్త కార్యదర్శులుగా ఐదేళ్లపాటు ఎన్‌టీఏలో పని చేస్తారు.ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ (ఆదాయ పన్ను) అధికారి ఆకాశ్ జైన్, ఇండియన్ ఆడిట్ అండ్ ఎకౌంట్స్ సర్వీసెస్ అధికారి ఆదిత్య రాజేంద్ర భోజగధియాలు ఎన్‌టీఏలో సంయుక్త డైరెక్టర్లుగా పని చేస్తారు.

ప్రధాన్‌ను తొలగించాలి: కాంగ్రెస్

మోదీ ప్రభుత్వ హయాంలో ప్రచారం చేసుకుంటున్న అమృత కాలం విద్యార్థుల పాలిట మృత కాలంగా మారిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. నీట్ రద్దుతో లక్షల మంది ఇబ్బందులు పడుతున్నారని, బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ డిమాండు చేశారు. దాదాపు 23 లక్షల మంది నీట్ విద్యార్థుల శ్రమ వృథా అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. భాజపా, ఆరెస్సెస్ కుమ్మక్కై విద్యా వ్యవస్థను నాశనం చేశాయని ఆరోపించారు. ఇప్పటిదాకా 80 సార్లు పేపర్లు లీక్ అయ్యాయని, 2 కోట్ల మంది యువత భవిష్యత్తు నాశనమైందని పేర్కొన్నారు.

శంషాబాద్ చుట్టూ మెగా ట్రాన్స్‌పోర్ట్ హబ్

ఈకబురు, హైదరాబాద్: ముగ్గురు మిత్రులు విదేశాల నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. శంషాబాద్ విమానాశ్రయంలో దిగి బయటికి వచ్చాక వారెవరికీ క్యాబ్ అవసరం రాలేదు. ఒకరు అక్కడే ఉన్న మెట్రో స్టేషన్‌కు చేరుకుని నాగోల్ వెళ్లిపోగా మరొకరు సమీపంలోని హైస్పీడ్ రైల్వే స్టేషన్‌కు వెళ్లి రైలు ఎక్కి కేవలం గంటన్నరలోనే విజయవాడకి చేరుకున్నారు. ఇంకొకరు కేవలం రెండు, మూడు కి.మీ. దూరంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన బస్ టెర్మినల్ నుంచి కరీంనగర్ వెళ్లారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కనిపించే ఈ తరహా రవాణా సౌకర్యాలు తెలంగాణ రాజధానిలోనూ సాకారం చేసేందుకు రాష్ట్రప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకోసం శంషాబాద్ విమానాశ్రయ పరిసరాలను మెగా ట్రాన్స్‌పోర్ట్ హబ్‌గా రూపొందించేందుకు కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. అన్నిరకాల రవాణా వ్యవస్థలు ఒకే దగ్గర ఉండేందుకు వీలుగా రోడ్లుభవనాలు, రవాణా, మున్సిపల్, పరిశ్రమలు, రెవెన్యూ వంటి శాఖలు.. హైస్పీడ్ రైల్ కారిడార్, జీఎంఆర్ ఎయిర్‌పోర్టు, మెట్రో రైలు, హెచ్ఎండీఏ, ఆర్టీసీ వంటి సంస్థల మధ్య సమన్వయ సమావేశాలు నిర్వహిస్తోంది. ముంబయిపుణెహైదరాబాద్ హైస్పీడ్ రైలు కారిడార్ తొలుత నిర్ణయించిన మేరకు కోకాపేట వరకే ఉండగా శంషాబాద్ వరకు విస్తరించాలని నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్)ను కోరింది. తెలంగాణకు గేట్‌వేగా?

ఇప్పటివరకు శంషాబాద్ అంటే అంతర్జాతీయ విమానాశ్రయం మాత్రమే. ఇకపై అది తెలంగాణ రవాణా వ్యవస్థకు కేంద్ర బిందువుగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. విమానం, మెట్రో, హైస్పీడ్ రైలు, అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్ అన్ని ఒకేచోట అన్న తరహాలో దేశంలోనే అతిపెద్ద సమగ్ర రవాణా కేంద్రంగా శంషాబాద్‌ను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రప్రభుత్వ ఆలోచనల్ని, ప్రాజెక్టుల ప్రణాళికల్ని రవాణా, రోడ్లు భవనాలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ సంబంధిత శాఖలు, సంస్థల దృష్టికి ఇటీవల తీసుకువెళ్లారు. ఈ క్రమంలో తాజాగా సచివాలయంలో సీఎస్ కార్యాలయంలో వివిధ శాఖలు, సంస్థల మధ్య సమన్వయం కోసం కీలక సమావేశం జరిగింది. ఈ ప్రణాళికలు కార్యరూపం దాలిస్తే శంషాబాద్ చుట్టూ కొత్త ఆర్థిక కార్యకలాపాలు, హోటళ్లు, లాజిస్టిక్స్ పార్కులు, కమర్షియల్ జోన్లు, ట్రావెల్ సర్వీసులు వేగంగా అభివృద్ధి చెందే ఆస్కారం ఉంటుంది.

150 ఎకరాల్లో బస్‌స్టేషన్

రాష్ట్రంలో వివిధ ప్రాంతాలు, పొరుగు రాష్ట్రాలకు రాకపోకలు సాగించే వారితోపాటు విమాన ప్రయాణికులకూ బస్సుల కనెక్టివిటీ ఉండేలా శంషాబాద్ సమీపంలోని బహదూర్‌గూడలో సుమారు 150 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో భారీ బస్ టెర్మినల్ నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఆదేశించారు. తెలంగాణ జిల్లాలన్నింటికీ నేరుగా అనుసంధానం కలిగేలా ఈ బస్‌స్టేషన్ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

నాగోల్ నుంచి మెట్రో

హైదరాబాద్ మెట్రో రెండో దశలో ప్రతిపాదించిన నాలుగు కీలక మార్గాల్లో నాగోల్‌శంషాబాద్ కారిడార్ ఒకటి. ఈ మార్గం అమల్లోకి వస్తే విమానం దిగిన ప్రయాణికులు నేరుగా మెట్రోలో హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలకు చేరుకోవచ్చు. ఇప్పటి వరకు ఎయిర్‌పోర్ట్‌కు మెట్రో ప్రత్యక్ష కనెక్టివిటీ లేకపోవడం వల్ల నగరం నుంచి క్యాబ్‌ల్లో చేరుకోవాల్సి వస్తోంది. కొత్త కారిడార్ నిర్మాణంతో భారీ ఛార్జీలు, ట్రాఫిక్ జామ్ వంటి సమస్యలు తీరుతాయి. శంషాబాద్‌లోనే హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ భారీ మెట్రో డిపో ప్రణాళికలు సైతం రూపొందించింది.

దేశంలోనే తొలి 'ఎయిర్-రైల్-రోడ్' హబ్?

ప్రస్తుతం దేశంలోని కొన్ని నగరాల్లో ఎయిర్‌పోర్ట్‌కు మెట్రో కనెక్టివిటీ ఉంది. మరికొన్ని చోట్ల బస్ టెర్మినల్ సమీపంలో ఉంది. కానీ ఇప్పటి వరకు విమానాశ్రయానికి మెట్రో, హైస్పీడ్ రైలు, భారీ ఇంటర్‌సిటీ బస్ టెర్మినల్.. ఇలా అన్ని రవాణా వ్యవస్థలు ఒకేజోన్‌లో ఉన్న ప్రాజెక్టు ఇప్పటివరకు దాదాపు లేదు. అందుకే ప్రణాళికలు కార్యరూపం దాలిస్తే తెలంగాణకు ఇది కేవలం రవాణా సదుపాయం మాత్రమే కాకుండా భవిష్యత్ నగర ప్రణాళికలకు జాతీయ మోడల్‌గా మారే అవకాశాలు ఉంటాయన్న అభిప్రాయాలు ఉన్నాయి.

న్యాయవ్యవస్థ 24x7 పనిచేయాలి: సీజేఐ

ఈకబురు,: న్యాయవ్యవస్థ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. సామాన్యుడి సమస్యలను పరిష్కరించేందుకు న్యాయస్థానాలు 24x7 ఆసుపత్రుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమస్యల నుంచి తక్షణ ఉపశమనం కలిగించే యంత్రాంగం ఉండాలని అన్నారు. న్యాయం అందించే ప్రక్రియను వేగవంతం చేయడానికి సాంకేతికత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వ్యవస్థను మరింతగా విస్తరించాలని సూచించారు. కొవిడ్ సమయంలోనూ విధులను నిర్వర్తించిన ఏకైక న్యాయవ్యవస్థ భారత్‌ది మాత్రమే అన్నారు. సాంకేతికత వల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. న్యాయవ్యవస్థ పనితీరులో మరింత పారదర్శకతను తీసుకురావడానికి సాంకేతికత సహాయపడుతుందని సీజేఐ పేర్కొన్నారు. సాంకేతిక పురోగతిని సౌకర్యానికి సంబంధించిన విషయంగా కాకుండా రాజ్యాంగ అవసరంగా చూడాలన్నారు. న్యాయవ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు డిజిటల్ వ్యవస్థలు సహాయపడతాయన్నారు. కోర్టు కేసుల్లో జాప్యాలు, అసమర్థతలకు సాంకేతికతే అత్యంత ప్రభావవంతమైన పరిష్కారమని ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయ పడ్డారు. అధునాతన సాఫ్ట్‌వేర్ వ్యవస్థలు కోర్టు తీర్పుల వేగాన్ని గణనీయంగా మెరుగుపరచగలవని పేర్కొన్నారు.

త్రిభాషా విధానంపై సీబీఎస్ఈ కీలక నిర్ణయం

ఈకబురు, హైదరాబాద్:

సీబీఎస్ఈ కీలక నిర్ణయం తీసుకుంది. తొమ్మిది, పది తరగతి విద్యార్థులకు త్రిభాషా విధానాన్ని తప్పనిసరి చేసింది. జులై ఒకటి నుంచి ఇది అమల్లోకి వస్తుందని వెల్లడించింది. సీబీఎస్ఈ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం.. ఆ మూడు భాషల్లో రెండు భారతీయ భాషలు ఉండాలి. మూడు భాషలను అధ్యయనం చేయాలి. ఇక పదో తరగతి విద్యార్థులకు ఒక ఊరట కల్పించింది. మూడో భాషకు బోర్డ్ ఎగ్జామ్ ఉండదని వెల్లడించింది. వారు భాషాధ్యయనంపైనే దృష్టి సారించేలా.. అనవసర ఒత్తిడి తగ్గించేందుకే ఈ ఏర్పాటు అని బోర్డ్ పేర్కొంది. ఆ పాఠ్యాంశానికి పాఠశాలల్లో చూపే ప్రతిభ ఆధారంగానే మార్కులు కేటాయిస్తారు.జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ)లో ఈ త్రిభాషా విధానం భాగం. విద్యార్థులు మూడు భాషలు నేర్చుకోవాలని ఎన్ఈపీ2020 సిఫార్సు చేస్తోంది. ఇందులో కచ్చితంగా రెండు భారతీయ భాషలుండాలి. ఈ ఫార్ములా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలన్నింటికీ వర్తిస్తుంది. అయితే విద్యార్థులకు నేర్పాల్సిన భాషలేమిటన్నది నిర్ణయించుకునే అధికారం రాష్ట్రాలదే.

---విదేశీ భాషల సంగతేంటి?

విద్యార్థులు మాధ్యమిక పాఠశాల స్థాయిలో భారతీయ భాషలు, ఆంగ్లంతోపాటు కొరియన్, జపనీస్, ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్ భాషలూ అభ్యసించవచ్చని ఎన్ఈపీ2020 చెబుతోంది. అధిక శాతం పాఠశాలల్లో భాషా మాధ్యమంగా ఉన్న ఆంగ్లాన్ని విదేశీ భాషగా పరిగణిస్తారు. అందుకే ఈ భాషను ఎంచుకునే విద్యార్థులు రెండు భారతీయ భాషలను ఎంచుకోవాల్సి ఉంటుంది. రాజ్యాంగ నిర్దేశాలను, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతోపాటు బహుభాషా తత్వాన్ని ప్రోత్సహించి జాతీయ సమైక్యతను సాధించేందుకే ఈ విధానామని ఎన్ఈపీ నిబంధనలు చెప్తున్నాయి. కాగా.. గతంలో ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని తమిళనాడు ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. ఇప్పుడు అక్కడ కొత్త ప్రభుత్వం కొలువుతీరింది. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు పిల్లలందరికీ హిందీ విధిగా బోధించాలని నిర్ణయించిన మహారాష్ట్ర ప్రభుత్వం.. తర్వాత విమర్శలు రావడంతో త్రిభాషా విధానం అమలుకు సంబంధించిన ఉత్తర్వులను వెనక్కి తీసుకున్న సంగతి తెలిసిందే.

పెట్టుబడులతో ఉత్తరాంధ్రకే వలసలు

సగర్వంగా స్వచ్ఛత వైపు అడుగులు

"17 నెలలుగా మనం స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించుకుంటున్నాం. స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేస్తున్నాం. పరిసరాలు, పరిశుభ్రత విషయంలో మార్పు కనిపిస్తోంది. మన ఆలోచనలు స్వచ్ఛంగా ఉంటే మన అలవాట్లు మారుతాయి. అలవాట్లు మారితే సమాజం మారుతుంది. సమాజం మారితేనే స్వచ్ఛాంధ్ర సాకారం అవుతుంది. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధన లక్ష్యంతో పనిచేస్తున్నాం. ప్రస్తుతం మన తలసరి ఆదాయం రూ. 3 లక్షలు. దీన్ని రాబోయే 22 ఏళ్లలో రూ. 54 లక్షలు చేయాలనే దిశగా ముందుకెళ్తున్నాం. పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు పీ4 తీసుకొచ్చాం. పైన ఉండే 10 శాతం మంది కింద ఉండే 20 శాతం మందిని ఆర్థికంగా పైకి తీసుకు రావాలి. 2047 నాటికి మనదేశం ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా నిలుస్తుంది. ఆ దిశగా ప్రదాని మోదీ ముందుకెళ్తున్నారని" సీఎం చంద్రబాబు అన్నారు.

జూన్ నాటికి 100 శాతం చెత్త శుభ్రం

"ప్రజా ప్రభుత్వం వచ్చాక 86 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్ క్లియర్ చేశాం. ఈ 23 నెలల్లో 121 లక్షల టన్నుల చెత్త తొలగించాం. జూన్ కల్లా వందశాతం పూర్తవుతుంది. డోర్ టు డోర్ కలెక్షన్ ద్వారా ప్రతీ రోజూ పట్టణాల్లో 7,527 టన్నులు, గ్రామాల్లో 1,430 టన్నుల చెత్తను సేకరిస్తున్నాం. రూ.1,254 కోట్లతో 6 వేస్ట్ టూ ఎనర్జీ ప్రాజెక్టులు 6 సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. చెత్త ప్రాసెసింగ్ కోసం రూ.603 కోట్లతో 107 ఇంటిగ్రేటెడ్ ప్లాంట్లు సిద్ధం చేస్తున్నాం. ఇవి అక్టోబర్ నాటికి అందుబాటులోకి వస్తే డంపింగ్ యార్డ్ అనేదే ఉండదు. నెట్ జీరో క్యాంపస్ లో భాగంగా హాస్టళ్ల నుంచి వ్యర్థాలు లేకుండా ప్రణాళిక చేశాం, ప్రభుత్వ కార్యాలయాల పై సోలార్ విద్యుత్ ఉత్పత్తి, కిచెన్ గార్డెన్స్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, కంపోస్టింగ్, వాటర్ టెస్ట్ కిట్స్, ముస్తాబు వంటివి అమలుచేస్తున్నాం. ప్రతీ నెలా 10, 20 తేదీల్లో ఈవ్యర్థాలు సేకరిస్తున్నాం. చెత్త సేకరణకు 200 ఈఆటోలు వినియోగిస్తున్నాం. ఈ నెలాఖరు కల్లా కొత్తగా 5,000 పుష్‌కార్ట్స్, 12,000 ట్రై సైకిళ్లు తెస్తాం. రాష్ట్రంలో ప్రస్తుతం 31.33 శాతం గ్రీన్ కవర్ ఉంది. 2030 నాటికి 37 శాతానికి, 2047 కల్లా 50 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 633 స్వచ్ఛ రథాలతో రోజుకు 125 టన్నుల పొడి చెత్త సేకరిస్తున్నాం. ఇప్పటికి 47 లక్షల కేజీల చెత్తను సేకరించి రూ.8 కోట్ల విలువైన నిత్యావసరాలు ఇచ్చారు. కొత్తగా గ్రీన్ షాప్స్ ను ప్రారంభించాం. ప్రజలే అక్కడికి వెళ్లి ప్లాస్టిక్, ఐరన్ వంటి వ్యర్థాలను ఇచ్చి...వస్తువులు పొందవచ్చు. వావ్ పేరుతో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నెల్లూరు, అనకాపల్లి, చిత్తూరులలో సర్క్యులర్ ఎకానమీ పార్కులు నిర్మిస్తున్నాం. నేటి నుంచి 50 ప్లాస్టిక్ వ్యర్థ యూనిట్లు వస్తుండగా మరో 210 యూనిట్లు జూన్‌కి అందుబాటులోకి తెస్తామని" ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

రాష్ట్రానికి మరిన్ని అవార్డులు రావాలి

"మన ఇల్లే కాదు. చుట్టూ ఉన్న పరిసరాలు, మన రహదారులను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. గతంలో నేను పాదయాత్ర చేసినప్పుడు గ్రామాలు, పట్టణాల్లో ఊరి చివర్లో ఎక్కడ చూసినా చెత్తాచెదారం కనిపించేది. అప్పుడే రహదారులను పరిశుభ్రంగా మార్చాలని నిర్ణయించుకున్నాను. అందుకే స్వచ్ఛ పథం పేరిట ఇప్పుడు కార్యక్రమం చేపడుతున్నాం. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో మురుగునీరు వ్యర్థాలు పొంగిపొర్లకుండా మ్యాజిక్ డ్రైన్లను నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను కూడా మనం వాడకుండా నిషేధం విధించుకోవాల్సిన అవసరం ఉంది. అత్యుత్తమ విధానాలను అనుసరించటం ద్వారా రాష్ట్రంలోని పంచాయితీలకు జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయి. కందులవారి పల్లె, చిత్తూరు జిల్లా, కాణిపాకం ఇలా వేర్వేరు పంచాయితీలు అత్యుత్తమ పనితీరు కనబరచడం ప్రభుత్వం చేస్తోన్న కృషికి దక్కిన ఫలితంగా భావిస్తున్నాను. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్వహించే ఈ శాఖలో జాతీయ స్థాయిలో 8 అవార్డులు వచ్చాయి. మరిన్ని అవార్డులను రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాలు దక్కించుకోవాలని కోరుతున్నాను. ఇవాల్టి నుంచి ఆపరేషన్ క్లీన్ స్వీప్ రాష్ట్రంలో ప్రారంభం అవుతుంది. నెలరోజు పాటు ఈ ప్రత్యేక డ్రైవ్ చేపడతాం. నాలుగు వారాల పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలి. మున్సిపాలిటీలు కూడా స్వచ్ఛతా అవార్డులు దక్కించుకుంటాయని ఆకాంక్షిస్తున్నానని" ముఖ్యమంత్రి తెలిపారు.

అధికారం అంటే విధ్వంసం కాదు

"శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకూ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం. 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టబుడులకు ఒప్పందాలు కుదిరాయి. ప్రతి ఒప్పందం కార్యరూపం దాల్చుతోంది. వీటి ద్వారా రానున్న రోజుల్లో 24 లక్షల ఉద్యోగాలు వస్తాయి. నిన్ననే పుట్టపర్తిలో డిఫెన్స్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసుకున్నాం. కేవలం 36 రోజుల్లో అనుమతులు తెచ్చి, భూములు ఇచ్చి దేశం గర్వించే డిఫెన్స్ ప్రాజెక్టును సాధించడం మన ప్రభుత్వ సామర్థ్యానికి నిదర్శనం. అధికారం అంటే విధ్వంసం కాదు. ప్రజల జీవితాలు మార్చే అవకాశం అని నమ్ముతున్నాం. అధికారం అంటే విశాఖకు గూగుల్ తేవడం, అమరావతికి క్వాంటం తేవడం, సీమకు డిఫెన్స్ ప్రాజెక్టు తేవడం. ఇకపై ఉత్తరాంధ్ర నుంచి వలసలు కాదు..ఉత్తరాంధ్రకే వలస వస్తారు దేశంలో ఎక్కడికి పోయినా శ్రీకాకుళం కాలనీ ఉంటుంది. పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఐటీ కంపెనీలు, డాటా సెంటర్లతో ఉత్తరాంధ్ర దశ మారుతుంది. సాగునీటి ప్రాజెక్టులతో దిశ మారుతుంది. దాదాపు రూ.1 లక్ష కోట్లతో రిలయన్స్ కూడా డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ఐటీ కంపెనీలతో పాటు ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, రెన్యూపవర్ గ్రీన్ ఎనర్జీ వంటి ప్రముఖ కంపెనీలు ఉత్తరాంధ్రలో అడుగుపెట్టాయి. జూలైలో భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభించుకుంటున్నాం. శ్రీకాకుళం జిల్లాకు మరో ఎయిర్ పోర్టు తీసుకువస్తాం. పలాసలో కొత్త ఎయిర్ పోర్ట్ ను కూడా త్వరలో నిర్మాణం చేపడతాం. మూలపేట పోర్టు ఉత్తరాంధ్రకే అడ్వాంటేజ్ అవుతుంది. ఈ ఏడాదిలోనే మూలపేట పోర్టును ప్రారంభిస్తాం". అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేస్తాం

"రాష్ట్రంలో ఎక్కువ జాతీయ రహదారి, సముద్ర తీరం, నీరు, తెలివైన ప్రజలు ఉండే జిల్లా శ్రీకాకుళం. కానీ అభివృద్ధిలో వెనుకుంది. శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేస్తాం. ఉత్తరాంధ్ర ఇన్ఫ్రా ప్రాజెక్టులతో పాటు సాగునీటి ప్రాజెక్టులపైనా దృష్టిపెట్టాం. ఉత్తరాంధ్రలో ఏ ప్రాజెక్టును ఎప్పటికల్లా పూర్తి చేయాలో ఇరిగేషన్ క్యాలెండర్ ఇచ్చాం. మద్దువలస స్టేజ్ 2 జనవరి 2027, హిరమండలం ఎత్తిపోతల పథకం ఏప్రిల్ 2027, వంశధార ఫేజ్ 2 స్టేజ్ 2 (హిరమండలం రిజర్వాయర్) జూలై 2027, తోటపల్లి డిస్ట్రిబ్యూటరీస్ జూలై 2027, జంఝావతి రిజర్వాయర్ ప్రాజెక్ట్ డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనులు చేస్తున్నాం. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నేరడి బ్యారేజ్ కు అడ్డంకులు తొలగి కేంద్రం నుంచి అనుమతులు సాధించాం. నవంబర్‌లో శంకుస్థాపన చేస్తాం. రాబోయే మూడేళ్లలో నేరేడి ప్రాజెక్టు పూర్తిచేస్తామని" ముఖ్యమంత్రి తెలిపారు.

గొడ్డలి పార్టీతో అప్రమత్తంగా ఉండాలి

"ప్రపంచంలో తెలుగువారు అగ్రస్థానంలో ఉండాలని, దేశంలో ఏపీ నెంబర్ వన్ స్టేట్ కావాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ప్రజలాంతా ఆలోచించాలి. 23 నెలల క్రితం వరకు ఉత్తరాంధ్రలో ఏమీ లేవు. నాటి పాలనలో ఎక్కడ చూసినా ప్రభుత్వ టెర్రరిజం, కబ్జాలు, బెదిరింపులు, కేసులు, అరాచకాలే. అచ్చెన్నాయుడు లాంటి నేతల్ని అక్రమ కేసుల్లో ఇరికించి అరెస్ట్ చేశారు. గడిచిన ఐదేళ్లలో ప్రజల్లో అశాంతి, అలజడి, అభద్రత నెలకొంది. ఎవరి ఆస్తి ఎప్పుడు కబ్జా చేస్తారో తెలీని పరిస్థితి. అనేక వనరులున్నప్పటికీ గొడ్డలి పార్టీతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి వేటు పడింది. అన్నింటినీ సరిచేసి ఏపీకి మళ్లీ బ్రాండ్ క్రియేట్ చేశాం. గొడ్డలి పార్టీ నాయకులు కులాలు, మతాలు, ప్రాంతాలు మధ్య చిచ్చు పెడతారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారంతో వ్యక్తిత్వ హననం చేస్తున్నారు. నేషనల్ క్రైమ్ బ్యూరో నివేదిక ప్రకారం దేశంలో ఫేక్ న్యూస్ ప్రచారం చేసే రాష్ట్రాల్లో ఏపీ 2వ స్థానంలో ఉందంటే గొడ్డలి పార్టీనే కారణం. పంపకాల్లో తేడాలు వస్తే సొంత వాళ్లను చంపేసి మళ్లీ మాపై బురద వేస్తారు. సొంత బాబాయ్ ని చంపి ఆ నేరం నాపై మోపారు. గొడ్డలి ప్లస్ అంటూ కొత్త నాటకాలతో వస్తారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఏదైనా ఒక పిలుపునిస్తే పాటించడంలో ఉత్తరాంధ్ర వాళ్లు ముందుంటారు. హుడ్ హుడ్ సమయంలో దీపావళి టపాసులు వద్దు అని చెపితే...చిన్న క్రాకర్ కూడా కాల్చలేదు. అదీ మీ నిబద్ధత"అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

ప్రధాని సూచనలు పాటిద్దాం

"యుద్ధ ప్రభావం కారణంగా ప్రధాని మోదీ చేసిన సూచనలను బాధ్యత గల పౌరులుగా అందరం పాటించి దేశానికి సహకరిద్దాం. వర్క్ ఫ్రం హోం అలవాటు చేసుకుని వీలైనంతవరకూ ఇంట్లో నుంచే పనిచేద్దాం. బంగారం కొనడం తగ్గిద్దాం. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ లోనే ప్రయాణిద్దాం. వంట నూనెల వాడకం తగ్గిద్దాం. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిద్దాం. మేడిన్ ఆంధ్రా, మేడిన్ ఇండియా బ్రాండ్లను కొనుగోలు చేద్దాం. టూరిజం కోసం విదేశీ పర్యటనల కంటే ఏపీ లోని పర్యాటక ప్రాంతాలకు వెళ్ళాలి"అని ముఖ్యమంత్రి ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనలో పొదుపు చర్యల్లో భాగంగా సీఎం నాలుగు వాహనాల కాన్వాయ్ లో మాత్రమే ప్రయాణించారు. శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట నియోజకవర్గ అభివృద్ధి నివేదికను సీఎం చంద్రబాబు ప్రజలకు చదివి వినిపించారు. వివిధ శాఖల పనితీరును ప్రజలకు వివరించారు. నియోజకవర్గ పరిధిలోని రాజులచెరువు ఆధునీకరణకు నిధులు మంజూరు చేస్తామని, ఎన్ హెచ్ 5 నుంచి నరసన్నపేట పట్టణ పరిధిలో రూ. 15 కోట్లు వ్యయంతో రహదారి నిర్మాణం చేపడతామని, కింజరాపు ఎర్రన్నాయుడు చిల్డ్రన్ పార్క్ ఏర్పాటు చేస్తామని , శ్రీముఖ లింగం ఆలయ ఉత్సవాలను ప్రభుత్వం తరపున అధికారికంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. అనంతరం ప్రజా వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం తిలకించారు. అక్కడ సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజనులు ప్రత్యేకంగా తయారు చేసిన సవర ఆర్ట్ ఓవర్ కోటు ను ముఖ్యమంత్రి ధరించారు. పోలీసులు ఏర్పాటు చేసిన హెల్మెట్ బ్యాంక్ ను చూసి సీఎం అభినందించారు. హెల్మెట్ ధరించి అక్కడే ఉన్న బుల్లెట్ వాహనం అధిరోహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యాసాశ్రమంలో వివాదాల ముసురు

తిరుపతి, మే 16(ఈకబురు)

తిరుపతి సమీపంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా పేరుగాంచిన శ్రీ వ్యాసాశ్రమంలో ఇటీవల నెలకొన్న పరిణామాలు భక్తుల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఆశ్రమ పీఠాధిపతి పూజ్యశ్రీ పరిపూర్ణానందగిరి స్వామి విడుదల చేసిన వివరణ ఒకవైపు ఉండగా, మరోవైపు కొందరు స్వామీజీలు, పూర్వ విద్యార్థులు, మాజీ నిర్వాహకులు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలు ఆశ్రమ వ్యవహారాలపై అనేక సందేహాలకు తావిస్తున్నాయి.దశాబ్దాలుగా భక్తుల విశ్వాసానికి కేంద్రంగా కొనసాగుతున్న వ్యాసాశ్రమం ప్రస్తుతం అంతర్గత విభేదాలతో వార్తల్లో నిలవడం భక్తులను ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా పీఠాధిపత్య వారసత్వం, ఆశ్రమ ఆస్తుల నిర్వహణ, విరాళాల వినియోగం, విద్యాసంస్థల పరిపాలన, ఆశ్రమ నిధుల లావాదేవీలపై పరస్పర ఆరోపణలు వెలువడుతున్నాయి.కొంతమంది పూర్వ విద్యార్థులు, స్వామీజీలు ఆశ్రమంలో నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకుంటున్నారని ఆరోపిస్తుండగా, ఆశ్రమ వర్గాలు మాత్రం అవన్నీ దుష్ప్రచారాలేనని చెబుతున్నాయి. అయితే ఈ వివాదం సామాజిక మాధ్యమాలు, వాట్సాప్ గ్రూపులు, పత్రికా ప్రకటనల వరకు చేరుకోవడంతో భక్తుల్లో నిజానిజాలపై సందేహాలు పెరుగుతున్నాయి.ఆశ్రమ అభివృద్ధి పేరుతో జరుగుతున్న నిర్మాణ పనులు, శతజయంతి ఉత్సవాల నిధుల సేకరణ, విరాళాల వినియోగంపై పూర్తి స్థాయి లెక్కలు భక్తులకు వెల్లడించాలని పలువురు కోరుతున్నారు. ఆశ్రమం పేరుతో వచ్చిన విరాళాలు, స్థలాలు, ఫిక్స్డ్ డిపాజిట్లు, విద్యాసంస్థల ఆదాయ వ్యయాలపై స్వతంత్ర ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.ఇక ఆశ్రమానికి చెందిన కొంతమంది మాజీ ఉద్యోగులు, నిర్వాహకులపై కూడా తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరస్పరం ఒకరిపై ఒకరు ఆర్థిక అక్రమాలు, అధికార దుర్వినియోగం, ఆశ్రమ వ్యవహారాల్లో జోక్యం వంటి ఆరోపణలు చేయడం పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తోంది. ఈ వివాదాల నేపథ్యంలో భక్తులు మాత్రం ఆశ్రమ పవిత్రత దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పలువురు భక్తులు మాట్లాడుతూ —— "ఆధ్యాత్మిక కేంద్రాలు ప్రశాంతత, సేవ, ధర్మప్రచారం కోసం ఉండాలి గానీ వివాదాలకు వేదిక కాకూడదు" అని అభిప్రాయపడుతున్నారు. ఆశ్రమానికి సంబంధించిన అన్ని విషయాల్లో పారదర్శకత పాటించి, భక్తుల విశ్వాసాన్ని కాపాడాలని కోరుతున్నారు.ఇక ఈ వివాదంపై ఎండోమెంట్స్ శాఖ, సంబంధిత ప్రభుత్వ అధికారులు దృష్టి సారించి వాస్తవాలను వెలికితీయాలని, అవసరమైతే ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేసి పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలని భక్తులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. విచారణ ద్వారా నిజానిజాలు బయటకు వస్తేనే భక్తుల్లో నెలకొన్న అనుమానాలకు తెరపడుతుందని అంటున్నారు.ఆధ్యాత్మిక సంస్థలపై ప్రజలకు ఉన్న విశ్వాసం ఎంతో విలువైనదని, వ్యక్తిగత విభేదాలు సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయకుండా అన్ని వర్గాలు సంయమనం పాటించాలని పలువురు ఆధ్యాత్మిక వేత్తలు సూచిస్తున్నారు.

జీఎస్‌టీ, వ్యాట్ మోసం కేసులో ఇద్దరు అరెస్టు

దిల్లీ: జీఎస్‌టీ, వ్యాట్ మోసం కేసుతో సంబంధమున్న ఇద్దరిని ఎకనమిక్ అఫెన్సెస్ వింగ్ (ఈఓడబ్ల్యూ) అరెస్టు చేసింది. వ్యాపార వివరాల దుర్వినియోగం, నకిలీ సంస్థలు, పలు బ్యాంకు ఖాతాల నుంచి నిధుల మళ్లింపు ద్వారా కోట్ల రూపాయల జీఎస్‌టీ, వ్యాట్ అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలపై ఈ చర్యను చేపట్టినట్లు ఓ అధికారి తెలిపారు. ఈ ఇద్దరిలో ఒకరు చార్టర్డ్ అకౌంటెంట్ అతుల్ గుప్తా కాగా.. మరొకరు రాజీవ్ కుమార్ పరాసర్ అని ఈఓడబ్ల్యూ తెలిపింది. యశస్వి శర్మ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసులో వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్‌ను కూడా రిజిష్టర్ చేసినట్లు తెలిపింది. తన సంస్థకు చెందిన వ్యాట్, జీఎస్‌టీ వివరాలు, పత్రాలను తన ప్రమేయం లేదా అనుమతి లేకుండా మోసపూరితంగా వినియోగించి సుమారు రూ.28.40 కోట్ల విలువైన అనుమానాస్పద లావాదేవీలు జరిపారని తన ఫిర్యాదులో శర్మ తెలిపారు. ఫిర్యాదుదారు సంస్థకు చెందిన బ్యాంకు ఖాతాలను రాజీవ్ కుమార్ పరాసర్, మరో ప్రొప్రయిటర్ నిర్వహించారని, భారీగా నిధుల మళ్లింపునకు ఈ ఖాతాలను వాళ్లు ఉపయోగించినట్లు దర్యాప్తులో తేలిందని ఈఓడబ్ల్యూ తెలిపింది.
నకిలీ జీఎస్‌టీ రశీదులు, డొల్ల కంపెనీలను ఉపయోగించి రూ.128 కోట్ల జీఎస్‌టీ మోసానికి పాల్పడ్డారనే ఆరోపణలపై ఆరుగురు వ్యక్తులను దిల్లీ పోలీస్‌కు చెందిన ఎకనమిక్ అఫెన్సెస్ వింగ్ అరెస్టు చేసింది.

ఈ–క్లచ్ టెక్నాలజీతో హోండా

గురుగ్రామ్: హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) తన పాపులర్ అడ్వెంచర్ టూరర్ మోడల్ 'ఎన్ఎక్స్500'ను సరికొత్త ఈ-క్లచ్ టెక్నాలజీతో మార్కెట్లోకి విడుదల చేసింది. క్లచ్‌తో పనిలేకుండా గేర్లు మార్చుకునే వెసులుబాటు కల్పించే ఈ టెక్నాలజీ బైక్ రైడింగ్ అనుభవాన్ని సరికొత్తగా మార్చనుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఈ ఆటోమేషన్ సాంకేతికతను భారత రైడింగ్ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించారు.
దీని ధరను కంపెనీ రూ. 7,43,900 (ఎక్స్-షోరూమ్ వద్ద) గా నిర్ణయించింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్న హోండా బిగ్‌వింగ్ డీలర్‌షిప్‌ల లో బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. ఇందులో 471 సీసీ, లిక్విడ్-కూల్డ్, ప్యారలల్-ట్విన్ ఇంజిన్‌ను 6-స్పీడ్ ట్రాన్స్‌మిషన్‌తో అమర్చారు. ఇది సిటీ రైడింగ్ హైవే టూరింగ్ రెండింటికీ అనువైన బలమైన టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఫీచర్ల విషయానికొస్తే... 5.0 అంగుళాల పూర్తి రంగుల టీఎఫ్‌టీ (టీఎఫ్‌టీ) డిస్‌ప్లే ఉంది.
ఇందులో నావిగేషన్, కాల్, మ్యూజిక్ ఫంక్షన్ల కోసం హోండా రోడ్‌సింక్ కనెక్టివిటీ లభిస్తుంది. భద్రత కోసం డ్యూయల్ ఛానల్ ఏబీఎస్, హోండా సెలెక్టబుల్ టార్క్ కంట్రోల్, పూర్తి ఎల్ఈడీ లైటింగ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. ఈ బైక్ మ్యాట్ గన్‌పౌడర్ బ్లాక్ మెటాలిక్, పెర్ల్ హోరిజోన్ వైట్ అనే రెండు ఆకర్షణీయమైన రంగుల్లో లభిస్తుంది. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ఐ అధ్యక్షుడు, సీఈఓ శ్రీ సుత్సుము ఒటాని మాట్లాడుతూ, ఈ-క్లచ్ సాంకేతికత పట్టణ, పర్యటన వాతావరణాలలో రైడర్ అలసటను తగ్గించి, సౌకర్యం, కంట్రోల్‌ను పెంచుతుందని ధీమా వ్యక్తం చేశారు.

జీసీసీ హబ్‌గా హైదరాబాద్

- కృత్రిమ మేధ హబ్‌గా, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకి (జీసీసీ) హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా మారుతోందని ఏఐ ఆధారిత క్వాలిటీ ఇంజినీరింగ్ సేవల సంస్థ క్వాలిజీల్ వెల్లడించింది. నగరంలో 400కు పైగా జీసీసీల్లో 3,00,000 మంది పైచిలుకు ప్రొఫెషనల్స్ ఉన్నారని వివరించింది. వీరితో పాటు దాదాపు పది లక్షల మంది ఐటీ, ఐటీఈఎస్ ప్రొఫెషనల్స్ ఉన్నట్లు ఎవరెస్ట్ గ్రూప్‌తో కలిసి రూపొందించిన శ్వేతపత్రంలో తెలిపింది.
- 2024లో 64.6 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత జీసీసీ పరిశ్రమ 2030 నాటికి 105 బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకునే దిశగా వేగంగా ముందుకు సాగుతోందని వివరించింది. 58 శాతం సెంటర్లు ఇప్పటికే ఏజెంటిక్ ఏఐలో ఇన్వెస్ట్ చేస్తున్నాయని పేర్కొంది. క్వాలిజీల్‌కి స్వయంగా హైదరాబాద్‌లో 3 జీసీసీలు ఉండగా, వీటిలో 850 మందికి పైగా ఇంజినీర్లు పని చేస్తున్నారు. 2028 నాటికి 100 మిలియన్ డాలర్ల ఆదాయ లక్ష్యం నిర్దేశించుకుంది.

మోర్గాన్ స్టాన్లీకి మన మార్కెట్లలో ఏం కనిపించింది?

బేర్ పట్టు ఉంటే: సెన్సెక్స్ 66,000కు పరిమితం కావొచ్చు(చమురు అధిక ధరలు ఎక్కువ కాలం కొనసాగితే)

అంతర్జాతీయంగా అనిశ్చితులు రాజ్యమేలుతున్నాయి. పశ్చిమాసియా యుద్ధ మేఘాలింకా వీడ లేదు. చమురు ధరల సెగ చల్లారనేలేదు. ఈ ప్రభావం దేశీయ కార్పొరేట్ కంపెనీలు ఆర్థిక ఫలితాలపై కనిపిస్తోంది. భవిష్యత్‌లోనూ ఉంటుందన్న అంచనాలున్నాయి. ఇన్ని ప్రతికూలతల మధ్య భారత స్టాక్ మార్కెట్లు బేరిష్ ధోరణిలో సాగుతాయని పలు అంతర్జాతీయ బ్రోకరేజీలు అంటున్నా, మన సూచీలు రాణించొచ్చని అమెరికా కేంద్రంగా పనిచేసే బహుళ జాతి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ మోర్గాన్ స్టాన్లీ అంచనా వేస్తోంది. ఎందుకు?
2027 జూన్ నాటికి అంటే రాబోయే 12 నెలల్లో బీఎస్ఈ సెన్సెక్స్ 89,000 పాయింట్లకు చేరొచ్చని మోర్గాన్ స్టాన్లీ అంచనా వేస్తోంది. సాంకేతిక బలాలకు తోడు భారత్‌లో మధ్యకాల వృద్ధిపై మంచి విశ్వాసం ఉందని, విధానాల పరంగానూ సానుకూలతలు కనిపిస్తున్నాయని ఈ సంస్థ ఈక్విటీ స్ట్రాటజిస్ట్ రిధమ్ దేశాయ్ అంటున్నారు. ఈ ప్రాథమిక అంచనాకు 50% సంభావ్యత ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం సెన్సెక్స్ 74,600 పాయింట్ల స్థాయుల్లో కదలాడుతోంది.

సానుకూలతలివీ..

అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితుల సమయంలోనూ రాణించగలిగే సత్తా భారత మార్కెట్‌కు ఉందని, 'డిఫెన్సివ్ గ్రోత్ మార్కెట్'గా భారత్‌ను సంస్థ అభివర్ణించింది. ఇందుకు కారణాలనూ చెబుతోంది. గత ఆరు త్రైమాసికాల మందగమనం తర్వాత, కార్పొరేట్ సంస్థల ఆర్థిక ఫలితాలు పుంజుకోవచ్చని అంటోంది. ఇందుకు ఆర్‌బీఐ రేట్ల కోతలు, బ్యాంక్ డీరెగ్యులేషన్, ద్రవ్యలభ్యత జొప్పించడం,
ఇంధన, రక్షణ, సెమీకండక్టర్, ఎరువులు, డేటా సెంటర్ల వంటి రంగాల్లో బలమైన మూలధన పెట్టుబడులు వస్తుండడం, పన్ను కోతలు.. ఇవన్నీ కలిసి కంపెనీల ఫలితాలకు దన్నుగా నిలవవచ్చని చెబుతోంది. దేశీయంగా బలమైన వృద్ధి, అంతర్జాతీయంగా స్థిరమైన వృద్ధికి తోడు ప్రస్తుత స్థాయుల నుంచి చమురు ధరలు తగ్గొచ్చన్న తమ ఊహలకు అనుగుణంగా ఈ అంచనాలను వెలువరించింది. ఇక 2009 నుంచీ అంతర్జాతీయ లాభాల్లో భారత వాటా తన అంతర్జాతీయ ఇండెక్స్ వెయిట్‌కు మించి ఉంటోందనీ చెప్పింది.

ఏఐ సవాళ్లు లేకపోలేదు..

కృత్రిమ మేధ(ఏఐ) కారణంగా భారత ఐటీ సేవల ఎగుమతులపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇదే ఈక్విటీ మార్కెట్‌కు అత్యంత సవాలు విసిరే అంశం. అయితే రాబోయే దశాబ్దంలో జీడీపీలో తయారీ వాటా పెరగనుండడం ఊరట కలిగించే అంశం. భారత్‌లో పెరుగుతున్న వినియోగదార్ల సంఖ్య, ఆదాయ పెరుగుదల, యువ జనాభా వంటివీ కలిసిరావొచ్చు. 2025లో అంతర్జాతీయ జీడీపీ వృద్ధిలో భారత వాటా 18 శాతంగా ఉంది. రాబోయే రోజుల్లో ఇది మరింత పెరగవచ్చు. భారత్‌కు ఏవైనా సవాళ్లు వస్తే అవి బయటి నుంచే మినహా దేశీయంగా ఏమీ ఉండవని అంటోంది. ముఖ్యంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అంతర్జాతీయ వృద్ధి మందగమనం రూపంలో సవాళ్లు ఎదురుకావొచ్చని అంచనా వేస్తోంది.

ఇతర బ్రోకరేజీల అంచనాలిలా..

భారత ఈక్విటీల రేటింగ్‌ను హెచ్ఎస్‌బీసీ గత నెలలో తగ్గించింది. ద్రవ్యోల్బణ భయాలకు తోడు గిరాకీ, కార్పొరేట్ లాభదాయకతపై ఒత్తిడిని కారణంగా చూపుతూ 'అండర్‌వెయిట్' రేటింగ్‌ను ఇచ్చింది. యూబీఎస్, నొమురా, సిటీ, గోల్డ్‌మన్ శాక్స్.. ఇలా పలు అంతర్జాతీయ సంస్థలు భారత స్టాక్ మార్కెట్లపై అప్రమత్తతను ప్రకటించాయి. పెరుగుతున్న ముడి చమురు ధరలు కార్పొరేట్ ఫలితాలపై ప్రభావం చూపుతాయని పేర్కొన్నాయి. ద్రవ్యోల్బణం, కరెంట్ ఖాతా లోటు పెరుగుతాయని అంచనా వేసింది.

వెండి దిగుమతులపై ఆంక్షలు

పశ్చిమాసియా సంక్షోభం వేళ విదేశీ మారక (డాలర్ల) నిల్వలను కాపాడుకునే క్రమంలో దిగుమతులను కట్టడి చేసే దిశగా కేంద్రం మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే పసిడి, వెండి, ప్లాటినంలపై సుంకాలను పెంచిన ప్రభుత్వం వెండికి సంబంధించి మరిన్ని నియంత్రణలను ప్రకటించింది. ఇప్పటి వరకు స్వేచ్ఛగా దిగుమతి చేసుకునే (ఫ్రీ ఇంపోర్ట్) కేటగిరీలో ఉన్న వెండిని ఆంక్షలు వర్తించే 'రిస్ట్రిక్టెడ్' కేటగిరీలోకి మార్చింది. దీనితో ఈ విభాగంలోని ఉత్పత్తులను దిగుమతి చేసుకోవాలంటే ప్రభుత్వం నుంచి లైసెన్సు అవసరం ఉంటుంది. తాజా పరిణామంతో ఇకపై 99.9 శాతం స్వచ్ఛత కలిగిన వెండి కడ్డీలు, సెమీప్రాసెస్డ్ సిల్వర్, సిల్వర్ పౌడర్, సాదా వెండి ఆభరణాల్లాంటి ఉత్పత్తులను దిగుమతి చేసుకోవాలన్నా డీజీఎఫ్‌టీ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్) నుంచి ప్రత్యేక అనుమతులు అవసరమవుతాయి.
అయితే, 100 శాతం ఎగుమతి ఆధారిత యూనిట్లు (ఈవోయూ), ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్)లోని యూనిట్లకు ఈ ఆంక్షలు వర్తించవు. కాకపోతే, అవి దిగుమతి చేసుకున్న వాటిని భారత మార్కెట్లో విక్రయించకుండా, పూర్తిగా ఎగుమతి మాత్రమే చేయాల్సి ఉంటుంది. పైపెచ్చు ముందస్తు అనుమతి తీసుకున్నా సరే... ఒకసారి 100 కిలోలకన్నా ఎక్కువ పరిమాణంలో దిగుమతి చేసుకోవటానికి అనుమతించరు. ఇక ఎగుమతి ఆధారిత యూనిట్లు తొలుత దిగుమతి చేసుకున్న వెండిని వినియోగించి... అందులో కనీసం 50 శాతాన్ని ఎగుమతి చేసినట్లు నిరూపిస్తేనే మరోసారి దిగుమతికి అనుమతిస్తారు. విలువైన లోహాల దిగుమతి కోసం విదేశీ మారక నిల్వలను భారీగా వెచ్చించాల్సి వస్తుండటంతో పసిడితో పాటు వెండి దిగుమతులపై కేంద్రం సుంకాలను ఆరు శాతం నుంచి 15 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే.

12 బిలియన్ డాలర్ల దిగుమతులు

భారత దిగుమతుల్లో వెండి వాటా ఏడాదికి దాదాపు 7 వేల నుంచి 9 వేల టన్నుల వరకు ఉంటోంది. కేంద్ర వాణిజ్య శాఖ గణాంకాల ప్రకారం 2025- 26లో వెండి దిగుమతులు పరిమాణం పరంగా 42 శాతం పెరిగి 7,335 టన్నులకు చేరాయి. విలువపరంగా 150 శాతం పెరిగి 12 బిలియన్ డాలర్లకు ఎగిశాయి. అంతర్జాతీయంగా ధరలు పెరగడమే ఇందుకు కారణం. దిగుమతి చేసుకునే వాటిల్లో ప్రధానంగా సిల్వర్ పౌడర్, బులియన్ కడ్డీలు, ముడి రూపంలోని వెండి ఉంటున్నాయి. కొత్త నిబంధనలతో వెండి దిగుమతుల్లో సింహభాగానికి డీజీఎఫ్‌టీ అనుమతి తప్పనిసరి కానుంది.

ఎందుకీ నిర్ణయాలు

కేంద్ర ప్రభుత్వం ప్రధానంగా మూడు లక్ష్యాలతో ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సంక్లిష్ట పరిస్థితుల్లో అత్యంత విలువైన ఫారెక్స్ నిల్వలను కాపాడుకోవడం అందులో ఒకటి. అలాగే వివిధ దేశాలతో పెరిగిపోతున్న వాణిజ్య లోటును నియంత్రించడం మరో లక్ష్యం. థాయ్‌లాండ్, యూఏఈలాంటి దేశాలతో భారత్‌కి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏ) ఉన్నాయి. దీనితో సుంకాల భారం భారీగా ఉండకుండా, ఆయా దేశాల మార్గం గుండా దిగుమతి చేసుకుంటున్నారని ప్రభుత్వం భావిస్తోంది. కనుక, ఎఫ్‌టీఏల దుర్వినియోగాన్ని అడ్డుకోవడానికి కూడా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిపుణులు చెబుతున్నారు.

సాధారణ ప్రజలపై ప్రభావం ఏంటంటే..

ఆభరణాలు ప్రియం..: అంతర్జాతీయంగా వెండి ధరలు భారీ స్థాయిలోనే కదలాడుతున్నాయి. ఇటీవలి సుంకాల విధింపుతో సిల్వర్ ధరలు ఒక్కసారిగా ఎగిశాయి. దీనికి తోడు ఇక సంక్లిష్టమైన లైసెన్సు ప్రక్రియ కూడా తోడైతే దిగుమతుల్లో జాప్యానికి దారి తీయొచ్చు. ఫలితంగా దేశీయంగా డిమాండ్, అలాగే ధరలు కూడా భారీగా ఎగిసే అవకాశం ఉంది. మన దగ్గర శుభకార్యాలు, ఇతరత్రా గిఫ్ట్ ఐటెమ్స్‌లో వెండి వినియోగం ఎక్కువే ఉంటోంది. అయితే, చిన్న వ్యాపారులు, ఆభరణాల తయారీదార్లకు ముడి వస్తువు వ్యయాలు పెరుగుతాయి కాబట్టి ఆ మేరకు వాటి రేట్లు కూడా పెరిగిపోతాయి.
స్మగ్లింగ్ ముప్పు..: దిగుమతి సుంకాలను పెంచినప్పుడే స్మగ్లింగ్ ముప్పులపై ఆందోళన వ్యక్తమైంది. ఇప్పుడు మరిన్ని నియంత్రణల వల్ల ఈ రిస్కులు ఇంకా పెరుగుతాయని పరిశ్రమవర్గాలు అంటున్నాయి.
పరిశ్రమలకు షాక్..: కేవలం ఆభరణాలకే పరిమితం కాకుండా ఇతరత్రా పారిశ్రామిక అవసరాలకు కూడా వెండి వినియోగం గణనీయంగా పెరిగింది. సోలార్ ప్యానెళ్లు, ఎలక్ట్రిక్ వాహనాల విడిభాగాలు, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ పరికరాలు .. ఇలా ఒకటేమిటి, అనేక అవసరాల కోసం సిల్వర్‌ని పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. తాజా నియంత్రణల వల్ల ఆయా పరిశ్రమలకు ముడి వస్తువు ఖర్చులు పెరిగిపోతాయి. ఫలితంగా అవి తయారు చేసే ఉత్పత్తుల ధరలూ పెరుగుతాయి.
పెట్టుబడులకు కొనసాగనున్న ఆసక్తి..
పసిడితో పాటు ఇన్వెస్టర్లు ఇప్పుడు వెండిని కూడా ఓ కీలకమైన పెట్టుబడి సాధనంగా పరిగణిస్తున్నారు. బంగారంతో పోలిస్తే అందుబాటు స్థాయిలో ఉండటంతో రేట్లలో తీవ్ర హెచ్చుతగ్గులు ఉంటున్నా సిల్వర్‌వైపు మొగ్గు చూపుతున్నారు. కాబట్టి పెట్టుబడి సాధనంగా ఇన్వెస్టర్ల కోణంలో దీనికి డిమాండ్ కొనసాగుతుందని నిపుణులు చెబుతున్నారు.

హైదరాబాద్‌లో 25% పెరిగిన ఇళ్ల విక్రయాలు



హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రధాన నగరాల్లో ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో ఇళ్ల విక్రయాలు 2 శాతం మేర తగ్గాయి. మార్కెట్‌లో గిరాకీ మందగించడం, అందుబాటు ధరల ఇళ్ల సరఫరా తగ్గడమే ఇందుకు కారణమని స్థిరాస్తి సేవల సంస్థ ప్రాప్‌టైగర్ వెల్లడించింది. ఈ మూడు నెలల కాలంలో మొత్తం 95,973 యూనిట్లు అమ్ముడవ్వగా, 2025 ఇదే కాలంలో వీటి సంఖ్య 98,095గా ఉంది. హైదరాబాద్, అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, కోల్‌కతా, ముంబయి మెట్రోపాలిటన్ రీజియన్, పుణెలను ఈ నివేదిక కోసం పరిశీలించింది. హైదరాబాద్‌లో గత ఏడాది మార్చి త్రైమాసికంలో 10,647 ఇళ్లు అమ్ముడవగా, ఈసారి 25 శాతం పెరిగి 13,297 యూనిట్లకు చేరుకున్నాయి. బెంగళూరులో 15,603, చెన్నైలో 4,774 యూనిట్లు అమ్ముడైనట్లు ప్రాప్‌టైగర్ పేర్కొంది. కొత్తగా మార్కెట్లోకి వస్తున్న ఇళ్ల సంఖ్య, అమ్ముడవుతున్న వాటికి దాదాపు సరిపోలుతుండటంతో అమ్ముడుపోని ఇళ్ల సంఖ్య పెద్దగా లేదని నివేదిక వివరించింది.

'సింగ్ గీతం' .. ఆద్యంతం వినోదాత్మకమే!

''దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ప్రతి సినిమాకీ కొత్తగా ఆలోచిస్తారు. ఈ 'సింగ్ గీతం' కూడా ఆయన శైలిలో సాగే ఓ కొత్త ప్రయోగమే. ఇది ఆద్యంతం వినోదాత్మకంగా ఉంటుంది'' అన్నారు నాగ్ అశ్విన్. ఇప్పుడాయన నిర్మాతగా.. దర్శకుడు సింగీతం శ్రీనివాసరావుతో రూపొందించిన చిత్రమే 'సింగ్ గీతం'. అయాన్, అహల్య బమ్రూ, షాలిని కొండేపూడి ప్రధాన పాత్రధారులుగా నటించారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా జూన్ 11న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఈ చిత్రం నుంచి ''హలో బాసు'' అనే గీతాన్ని విడుదల చేశారు. దీనికి దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు సమకూర్చడమే గాక ఉత్తాన భారిఘాట్‌తో కలిసి సాహిత్యమందించారు. వంశీ, ఆర్పీ కృష్ణాంగ్ ఆలపించారు. ఈ సందర్భంగా నిర్మాత నాగ్ అశ్విన్ మాట్లాడుతూ.. ''ఈ డిలీటెడ్ పాట చాలా బాగుంది. కాకపోతే దీన్ని సినిమాలో తీసేయమని చెప్పారు (నవ్వుతూ). సింగీతం శ్రీనివాసరావు కలల చిత్రమిది. ఆయన కలను నిజం చేయడానికి మేమంతా కొన్ని నెలలుగా చాలా కష్టపడి పని చేస్తున్నాం. 'జాతిరత్నాలు' తర్వాత నేను నిర్మిస్తున్న సినిమా ఇది. ఆ చిత్రాన్ని ఎలా నవ్వుతూ ఆస్వాదించారో.. ఈ సినిమానీ అలాగే ఎంజాయ్ చేస్తారని నమ్ముతున్నా. ఈ చిత్రం ఎంత వినోదాత్మకంగా ఉంటుందన్నది మేము విడుదల చేసిన ఈ తొలి పాటతోనే అర్థమవుతుంది'' అన్నారు. ''ఇది కచ్చితంగా ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని చ్చే సినిమా. నేనిందులో దాసు అనే పాత్ర చేశా. చాలా వినోదాత్మకంగా ఉంటుంది'' అన్నారు నటుడు వంశీ.

రాజస్థాన్‌లో 'వృషకర్మ'

నాగచైతన్య కథానాయకుడిగా 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'వృషకర్మ'. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్.బి నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. స్పర్శ్ శ్రీవాస్తవ, జయరామ్, సత్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా రాజస్థాన్‌లో ఓ కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. దీనికి సంబంధించిన వర్కింగ్ స్టిల్స్‌ను చిత్ర వర్గాలు సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నాయి. సినిమాకి ఆకర్షణగా నిలిచే కీలక ఎపిసోడ్‌ని ఈ షెడ్యూల్‌లో తెరకెక్కించారని.. రాజభవనాలు, పురాతన శిల్పకళతో అలరారుతున్న అందమైన లొకేషన్లలో చిత్రీకరించిన ఈ సన్నివేశాలు వెండితెరపై ప్రేక్షకుల్ని కనువిందు చేయనున్నాయని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయని.. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నామని స్పష్టత ఇచ్చారు. మైథలాజికల్ టచ్‌తో సాగే ఈ మిస్టికల్ హారర్ థ్రిల్లర్‌లో నిధి అన్వేషకుడిగా చైతన్య అలరించనున్నారు. ఈ సినిమాకి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, ఛాయాగ్రహణం: రాగుల్ డి.హెరియన్.

కేన్స్ లో హ్యుమా సందడి

'టాక్సిక్'తో త్వరలో ప్రేక్షకుల్ని పలకరించడానికి సన్నద్ధమవుతోంది బాలీవుడ్ కథానాయిక హ్యుమా ఖురేషీ. వైవిధ్యమైన కథలతో ప్రయాణం చేసే ఈమె.. తాజాగా ప్రతిష్ఠాత్మక కేన్స్ చిత్రోత్సవాల్లో మెరిసింది. ఇటీవలే ఈ ఫిల్మ్స్ ఫెస్టివల్ ఫ్రాన్స్‌లో వైభవంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. పలువురు భారతీయ సినీతారలు ఈ వేదికపై సందడి చేస్తుండగా.. హ్యుమా కూడా ఈ చిత్రోత్సవాల్లో అడుగుపెట్టి సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. ఈ వేడుకలో బనారసి చీర కట్టులో కనిపించి.. ఆకట్టుకునే అందంతో ప్రపంచ వేదికపై భారతీయ వారసత్వాన్ని చాటి చెప్పింది హ్యుమా.

దెయ్యంతో డిస్కషన్ ఏంటి..!

'మరీచిక' సినిమాతో ప్రేక్షకుల్ని థ్రిల్ చేసేందుకు సిద్ధమవుతున్నారు అనుపమ పరమేశ్వరన్, రెజీనా. వీళ్లిద్దరూ... విరాజ్ అశ్విన్ ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ చిత్రాన్ని సతీశ్ కాశెట్టి తెరకెక్కించారు. రాజీవ్ చిలక, మేఘా చిలక నిర్మించారు. అజయ్ ఘోష్ కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఈ నెల 29న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. ఇందులో వెంకట లక్ష్మి అనే పల్లెటూరి యువతిగా అనుపమ నటించగా.. సంజు అనే సిటీ కుర్రాడి పాత్రను విరాజ్ పోషించారు. వీళ్లిద్దరి బంధం బలపడుతుండగా.. వారి మధ్యలోకి మరీచిక అనే ఎన్నారైగా రెజీనా రావడం.. ఆ తర్వాత ముగ్గురి జీవితాల్లో చోటు చేసుకున్న పరిణామాల్ని ట్రైలర్‌లో ఉత్కంఠభరితంగా చూపించారు. ఈ ప్రచార చిత్రాన్ని బట్టి.. ఇదొక సైకలాజికల్ రివెంజ్ డ్రామా కథతో ముస్తాబైనట్లు అర్థమవుతోంది. "ఈ దెయ్యంతో డిస్కషన్ ఏంటి సర్.. చంపేయండి, లేదంటే మనల్నందర్నీ చంపేస్తుంది" అంటూ అనుపమ చెప్పిన డైలాగ్ ఆసక్తి రేకెత్తించింది. ఈ సినిమాకి కథ, సాహిత్యం, మాటలు: లక్ష్మి భూపాల, సంగీతం: ఇళయరాజా.

బాలయ్య డబుల్ ట్రీట్!

కథానాయకుడు నందమూరి బాలకృష్ణ చేతిలో ప్రస్తుతం రెండు సినిమాలున్నాయి. వీటిలో గోపీచంద్ మలినేని తెరకెక్కిస్తున్న సినిమా చిత్రీకరణ దశలో ఉండగా.. కొరటాల శివ రూపొందించనున్న సినిమా పూర్వ నిర్మాణ పనుల్లో ఉంది. ఇప్పుడీ రెండు ప్రాజెక్ట్‌ల నుంచి వరుస అప్‌డేట్లు బయటకు రానున్నట్లు తెలుస్తోంది. జూన్ 10న బాలకృష్ణ పుట్టినరోజు. ఈ సందర్భంగా తన 111వ చిత్ర టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేసేందుకు చిత్ర వర్గాలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇక మరోవైపు అదే రోజు కొరటాల సినిమాకి సంబంధించి చిత్రీకరణ విశేషాలతో పాటు కొత్త లుక్ బయటకొచ్చే అవకాశమున్నట్లు తెలిసింది. ఇప్పటికే వీటికి సంబంధించి తెర వెనుక కసరత్తులు మొదలైనట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ రెండు సినిమాల నుంచి అధికారిక ప్రకటనలు వెలువడే అవకాశముంది.

రూ.12 కోట్ల ఆఫర్‌ను తిరస్కరించిన త్రిష.. అందుకేనా!

వరుస సినిమాలతో సందడి చేస్తున్నారు నటి త్రిష. ఇప్పుడు ఆమెకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అగ్ర కథానాయకులు కమల్ హసన్ - రజనీకాంత్ కలిసి నటిస్తోన్న చిత్రంలో ఆమెను ఎంపిక చేసినట్లు గతంలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రం కోసం ఆమె భారీగా పారితోషికం తీసుకోనున్నట్లు కూడా ఎన్నో వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే, తమిళనాడు ఎన్నికల ఫలితాల అనంతరం త్రిష సినిమాల ఎంపికల్లోనూ ఎన్నో విషయాలు ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అందులోభాగంగానే ఈ సినిమా కోసం ఏకంగా రూ.12 కోట్లు ఆఫర్ చేసినప్పటికీ ఇందులో నటించేందుకు ఆమె (Trisha) సుముఖత చూపించడం లేదని ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి.

కమల్ హాసన్ రజనీకాంత్ (Rajinikanth) 46 ఏళ్ల తర్వాత కలిసి నటిస్తుండడంతో ఈ ప్రాజెక్ట్‌పై అందరిలో ఆసక్తి నెలకొంది. వీరి స్థాయికి తగినట్లే అగ్రకథానాయికను ఎంపిక చేయాలని టీమ్ త్రిషను తీసుకోనుందని గతంలో వార్తలు వచ్చాయి. భారీ పారితోషికం ఆఫర్ చేసినప్పటికీ ఆమె దీన్ని రిజెక్ట్ చేయడం వెనక బలమైన కారణం ఉందని టాక్. ఈ సినిమాను ఉదయనిధి స్టాలిన్‌కు చెందిన రెడ్‌జెయింట్ నిర్మాణసంస్థ తెరకెక్కించడంతో ఆమె తిరస్కరించినట్లు ఆంగ్ల మీడియా పేర్కొంది. అసలు త్రిష ఈ ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారా లేదా అనే దానిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.ఇక తాజాగా 'వీరభద్రుడు'లో లాయర్ ప్రీతిగా మెప్పించారు త్రిష. ప్రస్తుతం చిరంజీవికి జోడీగా 'విశ్వంభర'లో నటిస్తున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఫిల్మ్‌గా రూపొందుతోంది. భారీస్థాయిలో రానున్న ఈ సినిమా కోసం ప్రపంచంలోనే టాప్ వీఎఫ్ఎక్స్ కంపెనీలు పనిచేస్తున్నాయి

బుమ్రా ఉంటాడా లేదా?

దిల్లీ: కొత్త సీజన్లో వచ్చే నెల సొంతగడ్డపై తొలి టెస్టు ఆడబోతున్న టీమ్ఇండియా.. ఆ మ్యాచ్‌లో ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రాను ఆడిస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. ఐపీఎల్ ముగిసిన వారం లోపే అఫ్గానిస్థాన్‌తో భారత జట్టు ఏకైక టెస్టు ఆడనుంది. న్యూ చండీగఢ్ వేదికగా జూన్ 6న ఈ మ్యాచ్ మొదలవుతుంది. కొన్ని నెలలుగా బుమ్రా తీరిక లేకుండా క్రికెట్ ఆడుతున్నాడు. టీ20 ప్రపంచకప్ ముగియగానే ఐపీఎల్‌లో బరిలోకి దిగాడు. ఈ నేపథ్యంలో అతడికి అఫ్గాన్‌తో టెస్టుకు విశ్రాంతినివ్వడంపై సెలక్టర్లు పరిశీలించే అవకాశముంది. గత ఏడాది పని భార నిర్వహణలో భాగంగా బుమ్రాను కొన్ని మ్యాచ్‌లకు పక్కన పెట్టారు. ఈ సీజన్లోనూ అతడి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని, అఫ్గాన్ చిన్న జట్టే కాబట్టి బుమ్రా ఆడకపోయినా ఇబ్బంది ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే సీజన్ ఆరంభ మ్యాచ్‌లోనే ప్రధాన పేసర్ ఆడకపోవడం బాగుంటుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. మరి బుధవారం జరిగే సెలక్షన్ కమిటీ సమావేశంలో అజిత్ అగర్కార్ బృందం ఏం నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. ఈ సమావేశంలో ఈ టెస్టు మ్యాచ్‌కే కాక జూన్ 14, 17, 20 తేదీల్లో అఫ్గాన్‌తో వన్డేల్లో తలపడే జట్టును కూడా ఎంపిక చేస్తారు. ఐపీఎల్‌లో లఖ్‌నవూ తరపున నిలకడగా రాణిస్తున్న దిల్లీ పేసర్ ప్రిన్స్ యాదవ్‌ను వన్డే జట్టులోకి తీసుకునే అవకాశాలున్నట్లు సమాచారం. గాయంతో ఐపీఎల్‌కు దూరమైన పేసర్ హర్షిత్ రాణా.. అఫ్గాన్‌తో సిరీస్‌లోనూ ఆడే అవకాశాలు లేవు.

కోల్‌కథ.. ఇంకా ఉంది

ఐపీఎల్ 19లో వరుసగా మూడో రోజూ అదే కథ! పాయింట్ల పట్టికలో పైనున్న జట్టుకు కిందున్న జట్టు షాకిచ్చింది. పంజాబ్ కింగ్స్‌కు ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్‌కింగ్స్‌కు లఖ్‌నవూ సూపర్‌జెయింట్స్ చెక్ పెట్టగా.. ఇప్పుడు గుజరాత్ టైటాన్స్‌కు కోల్‌కతా నైట్‌రైడర్స్ బ్రేకులేసింది. ఓడితే ప్లేఆఫ్స్ రేసు నుంచి వైదొలిగే స్థితిలో బ్యాటుతో రెచ్చిపోయిన కోల్‌కతా 248 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా.. గుజరాత్ గట్టిగా పోరాడినప్పటికీ ఓటమిని తప్పించుకోలేకపోయింది.

డబుల్ హ్యాట్రిక్ గెలుపుతో ఈ సీజన్లో ప్లేఆఫ్స్ బెర్తును ఖాయం చేసుకున్న తొలి జట్టుగా నిలవాలన్న గుజరాత్ ఆశలకు కోల్‌కతా గండికొట్టింది. శనివారం ఈడెన్ గార్డెన్స్‌లో పరుగుల వరద పారిన మ్యాచ్‌లో నైట్‌రైడర్స్ 29 పరుగుల తేడాతో టైటాన్స్‌ను ఓడించింది. మొదట ఫిన్ అలెన్ (93; 35 బంతుల్లో 4×4, 10×6), ఆంగ్‌క్రిష్ రఘువంశీ (82 నాటౌట్; 44 బంతుల్లో 4×4, 7×6), కామెరూన్ గ్రీన్ (52 నాటౌట్; 28 బంతుల్లో 3×4, 4×6) చెలరేగడంతో కేకేఆర్ 2 వికెట్లకు 247 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం శుభ్‌మన్ గిల్ (85; 49 బంతుల్లో 5×4, 7×6), జోస్ బట్లర్ (57; 35 బంతుల్లో 5×4, 2×6), సాయి సుదర్శన్ (53 నాటౌట్; 28 బంతుల్లో 6×4, 3×6) గట్టిగానే పోరాడినప్పటికీ.. జట్టును గెలిపించలేకపోయారు. జీటీ 4 వికెట్లకు 218 పరుగులే చేయగలిగింది. సునీల్ నరైన్ (2/29), కామెరూన్ గ్రీన్ (1/25) ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. 12 మ్యాచ్‌ల్లో 11 పాయింట్లతో కోల్‌కతా ఇంకా ప్లేఆఫ్స్ రేసులోనే ఉంది. 13 మ్యాచ్‌ల్లో 16 పాయింట్లతో ప్లేఆఫ్స్ చేరువగా ఉన్న గుజరాత్.. ఇంకొక్క మ్యాచ్ ఆడాల్సి ఉంది.

పోటీ ఇచ్చింది కానీ..: ఛేదనలో గుజరాత్ దీటుగానే బదులిచ్చినప్పటికీ.. లక్ష్యం మరీ ఎక్కువ కావడంతో ఆ జట్టు పోరాటం సరిపోలేదు. ఆరంభంలో ఆశించినంత వేగంగా ఆడకపోవడం జీటీని దెబ్బ తీసింది. కార్తీక్ త్యాగి వేసిన మూడో ఓవర్లో సాయి సుదర్శన్ 4, 6, 4 ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చాడు కానీ.. అదే ఓవర్లో బంతి తగిలి గాయం కావడంతో అతను రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగాల్సి వచ్చింది. మూడో స్థానంలో వచ్చిన నిశాంత్ సింధు (1) విఫలమయ్యాడు. గిల్ కూడా గేర్ మార్చడానికి సమయం తీసుకున్నాడు. పవర్ ప్లేలో గుజరాత్ 56/1తో నిలిచింది. అయితే నరైన్ వేసిన తర్వాతి ఓవర్లో రెండు సిక్సర్లతో గిల్ జోరందుకున్నాడు. అనుకుల్ బౌలింగ్‌లోనూ అతను 2 సిక్సర్లు, ఒక ఫోర్ బాదాడు. మరో ఎండ్‌లో బట్లర్ నిలకడగా ఆడినా, అవసరమైనంత వేగంగా ఆడలేకపోయాడు. వరుణ్ చక్రవర్తి వేసిన 14వ ఓవర్లో గిల్ రెండు సిక్సర్లు, రెండు ఫోర్లతో 22 పరుగులు రాబట్టడంతో గుజరాత్ పోటీలోకి వచ్చింది. బట్లర్ కూడా జోరు పెంచడంతో 16 ఓవర్లకు 177/1తో గుజరాత్ పటిష్ఠ స్థితికి చేరుకుంది. కానీ నరైన్ తర్వాతి ఓవర్లో గిల్‌ను ఔట్ చేయడమే కాక, 5 పరుగులే ఇవ్వడంతో జీటీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. 19వ ఓవర్లో సౌరభ్ దూబె సైతం నరైన్ ఫీట్‌ను రిపీట్ చేశాడు. బట్లర్‌ను ఔట్ చేసి 5 పరుగులే ఇచ్చాడు. గిల్ ఔటయ్యాక తిరిగి బ్యాటింగ్‌కు వచ్చిన సుదర్శన్ పోరాడినప్పటికీ.. అది ఓటమి అంతరాన్ని తగ్గించడానికి మాత్రమే ఉపయోగపడింది.

మెరుపులే మెరుపులు: మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన కోల్‌కతా.. గుజరాత్ బౌలింగ్‌ను ఊచకోత కోసింది. తాను ఓ 10 ఓవర్లు క్రీజులో నిలిస్తే ఎలా ఉంటుందో ఫిన్ అలెన్ మరోసారి రుజువు చేశాడు. కెప్టెన్ రహానె (14) వైఫల్యాన్ని కొనసాగించగా, దాని వల్ల కోల్‌కతాకు మంచే జరిగింది. మూడో స్థానంలో వచ్చిన రఘువంశీ తన శైలికి భిన్నంగా మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. నాలుగో స్థానంలో వచ్చిన కామెరూన్ గ్రీన్ కూడా విధ్వంసకరంగా ఆడడంతో కేకేఆర్ స్కోరు 250కి చేరువైంది. అయితే 27 పరుగుల వద్ద అలెన్ ఇచ్చిన తేలికైన క్యాచ్‌ను లాంగాన్‌లో సిరాజ్ వదిలేయడంతో గుజరాత్ భారీ మూల్యమే చెల్లించుకుంది. ఈ జీవనదానం తర్వాత ఎదుర్కొన్న మూడు బంతులకు (రషీద్ బౌలింగ్‌లో) 6, 6, 4 బాదేసి తన విధ్వంసాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లాడు అలెన్. 21 బంతుల్లోనే అతడి అర్ధశతకం పూర్తయింది. సాధారణంగా కొంచెం నెమ్మదిగా ఆడే రఘువంశీ.. అలెన్ నుంచి స్ఫూర్తి పొంది భారీ షాట్లు కొట్టాడు. హోల్డర్ వేసిన 9వ ఓవర్లో అలెన్ రెండు సిక్స్‌లు బాదడంతో స్కోరు 100కు చేరుకుంది. అర్షద్ ఖాన్ వేసిన 11వ ఓవర్లో అలెన్ విశ్వరూపమే చూపించాడు. మూడు సిక్సర్లు, ఒక ఫోర్‌తో 22 పరుగులు రాబట్టిన అతను 90ల్లోకి వెళ్లిపోయాడు. తర్వాతి ఓవర్లో సాయికిశోర్.. అలెన్‌ను ఔట్ చేసినా జీటీకి ఉపశమనం దక్కలేదు టాప్ గేర్‌లోకి వెళ్లిపోగా.. కొత్త బ్యాటర్ గ్రీన్ సైతం ఆరంభం నుంచే చెలరేగిపోయాడు. సాయికిశోర్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు, ఒక ఫోర్ కొట్టిన గ్రీన్.. రషీద్ బౌలింగ్‌లో 4, 6 అందుకున్నాడు. సిరాజ్ వేసిన 19వ ఓవర్లో రఘువంశీ మూడు సిక్సర్లు, ఒక ఫోర్ బాదేయడంతో ఏకంగా 25 పరుగులు వచ్చాయి. 4 ఓవర్లలో సిరాజ్ ఒక వికెట్‌తో 50 పరుగులు ఇచ్చుకోగా.. రషీద్ ఖాన్ వికెట్ పడగొట్టకుండా ఏకంగా 57 పరుగులు సమర్పించుకోవడం గమనార్హం. రెండో వికెట్‌కు అలెన్‌తో 41 బంతుల్లోనే 95 పరుగులు జోడించిన రఘువంశీ.. గ్రీన్‌తో అభేద్యమైన మూడో వికెట్‌కు 52 బంతుల్లో 108 పరుగులు జత చేశాడు.

స్కోరు వివరాలు

కోల్‌కతా ఇన్నింగ్స్: రహానె (బ) సిరాజ్ 14; అలెన్ (సి) రషీద్ (బ) సాయికిశోర్ 93; రఘువంశీ నాటౌట్ 82; గ్రీన్ నాటౌట్ 52; ఎక్స్‌ట్రాలు 6 మొత్తం: (20 ఓవర్లలో 2 వికెట్లకు) 247; వికెట్ల పతనం: 1-44, 2-139; బౌలింగ్: సిరాజ్ 4-0-50-1; రబాడ 4-0-40-0; హోల్డర్ 4-0-39-0; రషీద్ ఖాన్ 4-0-57-0; సాయికిశోర్ 3-0-38-1; అర్షద్ ఖాన్ 1-0-22-0

గుజరాత్ ఇన్నింగ్స్: సుదర్శన్ నాటౌట్ 53; గిల్ (సి) అనుకుల్ (బ) నరైన్ 85; నిశాంత్ (సి) మనీశ్ (బ) నరైన్ 1; బట్లర్ (సి) రమణ్‌దీప్ (బ) సౌరభ్ 57; తెవాతియా (సి) రఘువంశీ (బ) గ్రీన్ 2; ఎక్స్‌ట్రాలు 20, మొత్తం: (20 ఓవర్లలో 4 వికెట్లకు) 218; వికెట్ల పతనం: 1-49, 2-177, 3-207, 4-218; బౌలింగ్: సౌరభ్ దూబె 2.4-0-23-1; గ్రీన్ 3-0-25-1; త్యాగి 4-0-59-0; పతిరన 1.2-0-9-0; నరైన్ 4-0-29-2; వరుణ్ 4-0-47-0; అనుకుల్ 1-0-17-0

ఫైనల్లో సాత్విక్ జోడీ

బ్యాంకాక్: భారత స్టార్ డబుల్స్ క్రీడాకారులు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి అదరగొట్టారు. ఉత్కంఠ పోరులో విజయం సాధించి థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో ఫైనల్‌కు దూసుకెళ్లారు. సెమీస్‌లో ప్రపంచ నం.4 భారత జోడీ 1921, 2220, 2116తో ప్రపంచ నం.9 గోహ్ ఫెయినూరిజుద్దీన్ (మలేసియా) జంటపై విజయం సాధించింది. ఆద్యంతం హోరాహోరీగా సాగిన ఈ పోరు గంటా 32 నిమిషాలకు ముగియడం విశేషం. ఈ మ్యాచ్ అంత తేలిక కాదని భారత జోడీకి ఆరంభంలోనే అర్థమైంది. గేమ్‌లో చాలా వరకు మలేసియా ద్వయమే ఆధిపత్యం చలాయించింది. 159తో సునాయాసంగా గేమ్ గెలిచేలా కనిపించిన ప్రత్యర్థి జోడీని భారత జంట గట్టిగా ప్రతిఘటించింది. 1518తో స్కోరు అంతరాన్ని తగ్గించింది. కానీ చివరికి ప్రత్యర్థులదే పైచేయి అయింది. రెండో గేమ్ ఇంకా హోరాహోరీగా సాగింది. 1616తో స్కోరు సమమైన దశలో సాత్విక్, చిరాగ్ ధాటిగా ఆడి 1916తో గేమ్ విజయానికి చేరువయ్యారు. కానీ మలేసియా ద్వయం అద్భుతంగా పుంజుకుని 2020తో స్కోరు సమం చేసింది. ఈ దశలో ఉత్కంఠను అధిగమిస్తూ భారత ద్వయం గేమ్‌ను సొంతం చేసుకుంది. నిర్ణయాత్మక మూడో గేమ్ కూడా ఆరంభంలో పోటాపోటీగానే సాగింది. 55తో స్కోరు సమమైన దశలో విజృంభించిన భారత ద్వయం 115తో పైచేయి సాధించింది. ప్రత్యర్థులు తర్వాత పుంజుకున్నప్పటికీ.. సాత్విక్, చిరాగ్ వారికి అవకాశమివ్వకుండా గేమ్‌ను, మ్యాచ్‌ను సొంతం చేసుకున్నారు. భారత ద్వయం ఇక్కడ 2019, 2024లో టైటిళ్లు గెలిచారు. తమ ఖాతాలో మూడో టైటిల్ చేరుతుందని సాత్విక్ ఆశాభావం వ్యక్తం చేశాడు. ''నేను గాయపడ్డపుడు నాకే ఎందుకిలా జరుగుతోంది అనుకున్నా. కానీ ఇవన్నీ ఆటలో భాగం. మేం దూకుడుగా ఆడుతుంటాం కాబట్టి గాయాలు మామూలే. నేను పూర్తి ఫిట్‌గా లేనపుడు కూడా నా భాగస్వామి మద్దతుగా నిలిచాడు. టైటిళ్లు గెలవలేకపోతున్న సమయంలో థామస్ కప్ సందర్భంగా నేను సహచరులకు ఒక మాట చెప్పాను. ఒక్కసారి పోడియంపై నిలబడితే అంతా మారుతుందని. ఇప్పుడు అదే నిజమైంది. థామస్ కప్‌లో కాంస్యం గెలిచాక మేం వెనుదిరిగి చూడాల్సిన అవసరం కనిపించడం లేదు. మా ఆలోచన తీరు మారిపోయింది. థాయ్‌లాండ్ ఓపెన్‌లోనూ గెలుస్తాం'' అని సాత్విక్ అన్నాడు.

ప్లేఆఫ్స్ పోరులో కీలక 'డబుల్'

ఇంకో వారంలో ఐపీఎల్ లీగ్ దశ ముగుస్తుంది. అయినా ఇంతవరకు ఏ జట్టు కూడా ప్లేఆఫ్స్ బెర్తు ఖాయం చేసుకోలేదు. ముంబయి, లఖ్‌నవూ మాత్రమే టోర్నీ నుంచి అధికారికంగా నిష్క్రమించాయి. నాలుగు కంటే ఎక్కువ జట్లు 16 పాయింట్లు సాధించే అవకాశం ఉండడంతో ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారింది. ఈ నేపథ్యంలో ఆదివారం రెండు కీలక మ్యాచ్‌లు జరగనున్నాయి.

ఈ సీజన్ ప్రథమార్ధంలో డబుల్ హ్యాట్రిక్ విజయాలతో తిరుగులేకుండా నిలిచిన పంజాబ్ కింగ్స్.. కచ్చితంగా టాప్2లో ఉంటుందనిపించింది. కానీ ఆ జట్టు అయిదు వరుస పరాజయాలతో ఆఖరికి ప్లేఆఫ్స్ చేరాలన్నా పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిగతా జట్ల ఫలితాలపై ఆధారపడకూడదంటే ఉన్న రెండు మ్యాచ్ (ఆర్సీబీ, ఎస్ఆర్‌హెచ్)ల్లో గెలిస్తే 17 పాయింట్లతో శ్రేయస్ సేనకు ప్లేఆఫ్స్‌లో స్థానం దక్కుతుంది. పంజాబ్ ఆదివారం సొంతగడ్డ (ధర్మశాల)పై అగ్రస్థానంలో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది. అన్ని విభాగాల్లో సమష్టిగా రాణిస్తూ దూసుకెళ్తున్న ఆర్సీబీపై గెలవాలంటే కింగ్స్ చెమటోడ్చాల్సిందే. ప్రస్తుతం పంజాబ్ 13 పాయింట్ల (12 మ్యాచ్‌ల్లో 6 విజయాలు)తో నాలుగో స్థానంలో ఉంది. వరుస ఓటముల వల్ల కింగ్స్ ఆత్మవిశ్వాసం బాగా దెబ్బతింది. బ్యాటింగ్ పరంగా పంజాబ్‌కు పెద్దగా సమస్యలు లేనప్పటికీ.. బౌలింగ్, ఫీల్డింగే పెద్ద తలనొప్పి. ధర్మశాలలో గత రెండు మ్యాచ్‌ల్లో పంజాబ్ 200, 210 స్కోర్లను కాపాడుకోలేకపోయింది. ముఖ్యంగా డెత్ ఓవర్లలో ఆ జట్టు బౌలింగ్ దారుణం. క్యాచ్‌లు వదిలిపెడుతుండడంతో ప్రత్యర్థులు అందిపుచ్చుకుంటున్నారు. మరోవైపు అగ్రస్థానంలో ఉన్న బెంగళూరు ఇంకొక్క గెలుపుతో ప్లేఆఫ్స్ బెర్తు ఖరారు చేసుకోవాలని చూస్తోంది. అంతేకాక ఉన్న రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచి (ఆఖరి మ్యాచ్ హైదరాబాద్‌తో) క్వాలిఫయర్1లో ఆడాలని ఉత్సాహంగా ఉంది.

దిల్లీనా.. రాజస్థానా: మరో మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్, దిల్లీ క్యాపిటల్స్ పోటీపడనున్నాయి. టోర్నీ ఆరంభంలో పటిష్ఠ జట్టులా కనిపించిన రాజస్థాన్.. గత ఏడు మ్యాచ్‌ల్లో అయిదు ఓటములతో గతి తప్పింది. ఆర్ఆర్ 11 మ్యాచ్‌ల్లో 12 పాయింట్లతో అయిదో స్థానంలో ఉంది. శుక్రవారం చెన్నై ఓటమి రాయల్స్‌కు బాగా కలిసొచ్చింది. ఆ జట్టు ఎక్కువగా వైభవ్ సూర్యవంశీపైనే ఆధారపడుతోంది. అతడు ఔటైతే స్కోరులో వేగం పడిపోతుండడం, బౌలింగ్‌లోనూ కలిసికట్టుగా రాణించలేకపోతుండడం ఆ జట్టుకు ప్రతికూలంగా మారింది. అయితే ఆ జట్టుకు మిగతా 3 మ్యాచ్‌లు పట్టికలో దిగువన ఉన్న (దిల్లీ, లఖ్‌నవూ, ముంబయి) జట్లతో ఉండడంతో పుంజుకుంటుందేమో చూడాలి. ఇక దిల్లీ దాదాపుగా నిష్క్రమించినప్పటికీ.. స్వల్ప అవకాశాలతో కొట్టుమిట్టాడుతోంది. 12 మ్యాచ్‌ల్లో 5 విజయాలతో ఏడో స్థానంలో ఉంది. ఉన్న రెండు మ్యాచ్‌లూ (ఆఖరిది కోల్‌కతాతో) గెలిచినా ముందంజ వేస్తుందన్న గ్యారంటీ లేదు. ఓడిపోతే మాత్రం అధికారికంగా టోర్నీ నుంచి వైదొలగుతుంది.

ప్రాక్టీస్‌లోనూ ప్రశాంతత ఉండటం లేదు..

ముంబయి: ఐపీఎల్ జట్ల సోషల్ మీడియా టీమ్‌లు ఆటగాళ్ల వ్యక్తిగత సంభాషణలు, ప్రాక్టీస్ సెషన్లను నిరంతరం చిత్రీకరించడం తనకు అసౌకర్యంగా ఉంటుందని భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి అన్నాడు. "ప్రాక్టీస్ కోసం మైదానంలో అడుగుపెడితే ఆరు కెమెరాలు అనుసరించడం అసౌకర్యంగా అనిపిస్తుంది. ఆటపై ప్రశాంతంగా కసరత్తు చేసే స్వేచ్ఛ ఆటగాడికి ఉండాలి. ప్రతీదాన్ని చిత్రీకరించి విశ్లేషిస్తే సహజంగా ఉండలేం. ప్రాక్టీస్‌లో కొంత భిన్నంగా ఆడదామనుకున్నా ఆడలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఎందుకంటే ప్రాక్టీస్‌ను ఎవరైనా చిత్రీకరించి దానిపై చర్చలు చేయగలరు. మ్యాచ్‌లో ప్రదర్శన ఆధారంగానే ఆటగాళ్లపై అంచనాకు రావాలి.. మ్యాచ్ ప్రాక్టీస్ ఆధారంగా కాదు. ఆటలో ఎంత ఒత్తిడినైనా తీసుకోగలను. కానీ ఇలా వ్యక్తిగత స్వేచ్ఛ లేకపోవడాన్ని భరించలేను. అభిమానులకు చేరువ కావడానికి ఏ ఫ్రాంఛైజీకి అయినా సామాజిక మాధ్యమాలది కీలకపాత్ర. అయితే దానికి కొన్ని పరిమితులుండటం అవసరం. ఐపీఎల్‌లో ఓ మ్యాచ్ సందర్భంగా కేన్ విలియమ్సన్‌తో మాట్లాడుతుండగా రోబో కెమెరా 'చంపక్' నావైపు చూస్తూ.. సంజ్ఞలు చేస్తోంది. తొలుత దాన్ని విస్మరించాను. తర్వాత దాన్ని నడిపిస్తున్న ఆపరేటర్‌ను రోబోను పక్కకు తీసుకెళ్లమని చెప్పాల్సివచ్చింది. కేన్ నా స్నేహితుడు. అతడితో ప్రశాంతంగా మాట్లాడలేని పరిస్థితులు కల్పిస్తున్నారు" అని కోహ్లి వివరించాడు.